# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 6-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 61 | పేజీలు 8 | వెల: రూ.1/-


## కశ్మీర్‌లో గ్రేనేడ్ దాడి..
## 10 మందికి గాయాలు

హైదరాబాద్, అక్టోబర్ 5: జమ్మూకశ్మీర్‌లో గ్రేనేడ్ దాడి జరిగింది. అనంత్‌నాగ్‌లోని డిప్యూటీ కమిషనర్స్ ఆఫీసు ముందు ఈ దాడి ఘటన చోటుచేసుకున్నది. ఈ దాడిలో సుమారు 10 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిలో ఓ ట్రాఫిక్ పోలీసు, జర్నలిస్టు ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం కేవలం స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటన పట్ల విచారణ మొదలుపెట్టారు. ఉగ్రవాదులు పోలీసు ఆఫీసును టార్గెట్ చేసినా.. గ్రేనేడ్ రోడ్డుపై పేలింది. ఇప్పటి వరకు ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఎవరూ ప్రకటించలేదు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత భద్రతా దళాలపై దాడి జరగడం ఇదిరెండవసారి.



### ఎక్కడి బస్సులు అక్కడే
# రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ప్రభావం తీవ్రం

- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా కానరాని ఫలితం
- అద్దె బస్సులు, ప్రైవేట్ బస్సులను తిప్పుతున్న అధికారులు
- అడ్డుకుంటున్న కార్మికులు, పలు ప్రాంతాల్లో డిపోల ఎదుట ఆందోళన
- ఆందోళన కారులను అరెస్టు చేసిన పోలీసులు
- నిర్మానుష్యంగా బస్టాండ్‌లు
- పలు ప్రాంతాల్లో బస్సులపై రాళ్లదాడి
- సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కుతగ్గమంటున్న కార్మిక సంఘాలు
- ప్రయాణీకులను దోచుకుంటున్న ప్రైవేట్ వాహనదారులు
- హైదరాబాద్‌లో మెట్రోను ఆశ్రయించిన ప్రయాణీకులు

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆర్టీసీ కార్మికులు సమ్మెబాట పట్టడంతో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు యత్నించగా.. కార్మికులు అడ్డుకున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏవీ ప్రయాణికులను ఆదుకోలేక పోయాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లోని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌ల వద్ద ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా ప్రత్నామ్నాయ చర్యలు చేపట్టినప్పటికీ ఇబ్బందులు తప్పలేదు. పలు జిల్లాలో పోలీస్‌ల భద్రత నడుమ అధికారులు ప్రైవేట్ బస్సులను, స్కూల్ బస్సులను నడిపించారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వం మెట్రో ట్రిప్పులను పెంచింది. దీంతో నగరవాసులు మెట్రోను ఆశ్రయించడంతో మెట్రో స్టేషన్‌లు ప్రయాణీకులతో కిక్కిరుస్తున్నాయి.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత తదితర 26 డిమాండ్లతో తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె కొనసాగుతోంది. సమ్మె కారణంగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు నడిపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పోలీసుల భద్రత నడుమ అధికారులు బస్సులు నడుపుతున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పలు ఆర్టీసీ బస్సులతో పాటు, ప్రైవేట్ బస్సులను నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అందుబాటులో ఉన్న ప్రైవేట్ డ్రైవర్లను, కండక్టర్లను విధుల్లోకి తీసుకొని బస్సులు నడిపే ప్రయత్నం చేశారు. పోలీసుల భద్రత నడుమ ప్రైవేట్ డ్రైవర్లతో పాక్షికంగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్లలోకి పోలీసులు ప్రైవేటు వాహనాలను అనుమతిస్తున్నారు. తాత్కాలిక సిబ్బంది కోసం ఆర్టీసీ అధికారుల ఇచ్చిన నోటిపికేషన్‌తో ప్రయివేట్ డ్రైవర్లు జేబీఎస్‌కు చేరుకోవటంతో ఆర్టీఏ అధికారులు వారికి ట్రయల్ రన్ నిర్వహించిన తర్వాత వారికి బస్సులు అప్పగిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రయివేట్ ట్రావెల్స్, క్యాబ్‌లు అధిక ఛార్జీలు వసూళ్లు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా దిల్‌సుఖ్ నగర్ డిపోలో 110 సిటీ బస్సులు నిలిచిపోయాయి. అయితే డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. అదిలాబాద్ జిల్లాలో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. అయితే ప్రత్నామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఇప్పటివరకు ప్రయివేట్ డ్రైవర్ల సహాయంతో 18 బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించారు. ఉమ్మడి అదిలాబాద్‌లో ఆరు డిపోలల్లో 185 అద్దె బస్సులు ఉన్నాయని, ఆర్టీసీ బస్సులు 140, అద్దెబస్సులు 160 వరకు తిరుగుతున్నాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందుకోసం తాత్కాలిక ప్రైవేట్ డ్రైవర్లను, కండెక్టర్లను నియమించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే డిపోలు, బస్టాండ్‌లవద్ద పోలీసులు పూర్తి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వరంగల్ రీజియన్ పరిధిలో తొమ్మిది డిపోలలోని 972 ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జిల్లాకు చెందిన 4200 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. బస్టాండ్లు, డిపోల ముందు పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మహబూబాబాద్ బస్టాండ్ ముందు ధర్నా నిర్వహిస్తున్న పది మంది ఆర్టీసీ కార్మికులను పోలీసులు ఆరెస్ట్ చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల పరిధిలో సమ్మె ప్రభావంతో 670 ఆర్టీసీ, 182 అద్దె బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లాకు చెందిన 3200 మంది ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92బస్సులను అధికారులు నడిపించఆరు. డిపోలు, బస్టాండ్‌ల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మె కారణంగా 10 డిపోలలో 909 ఆర్టీసీ, 209 అద్దె బస్సులు నిలిచిపోయాయి. 3900 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. అయితే ప్రయాణికుల రద్దీని బట్టి ప్రయివేట్, స్కూల్ బస్సులను నడిపేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ హెచ్చరికలతో కొంత మంది కార్మికులు పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అయితే అలాంటి హెచ్చరికలకు భయపడేది లేదని కార్మిక సంఘాల నేతలు తేల్చిచెబుతున్నారు. మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల పరిధిలో 880 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఉదయం నుంచే డిపోల ముందు కార్మికులు భైఠాయించారు. దీంతో భారీగా పోలీసులు మోహరించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మెతో నాగర్ కర్నూల్ డిపోల్లోనే బస్సులు నిలిచిపోయాయి. ఉదయం నుంచే డిపోల ముందు కార్మికులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి బస్సు డిపో ముందు కార్మికులు బస్సులు కదలకుండా భైఠాయించారు. అయితే పోలీసుల సహకారంతో

కొన్ని ప్రయివేట్ సర్వీసులను ఆర్టీసీ అధికారులు నడిపించారు. నారాయణ పేట జిల్లాలో ఆర్టీసీ సమ్మె కారణంగా డిపోల్లోనే బస్సులు నిలిచిపోయాయి. అయితే ఆర్టీసీ అధికారులు ప్రయివేట్ వ్యక్తులతో పాక్షికంగా బస్సులను నడిపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బస్సు డిపోలు, బస్టాండ్‌ల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మెదక్ ఉమ్మడి జిల్లాలో డిపోలకే బస్సులు పరిమితమయ్యాయి. మెదక్ రీజియన్‌లోని 8డిపోల్లో 672 ఆర్టీసీ, 190 అద్దె బస్సులు నిలిచిపోయాయి. పోలీసుల భారీ బందోబస్తు నడుమ అద్దె బస్సులతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. కార్మికులు విధులు బహిష్కరించడంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. అయితే అన్ని డిపోల ముందు పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. డిపో, బస్టాండ్ల ముందు కార్మికులు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని పోలీసులు వారిని హెచ్చరించారు. వికారాబాద్ ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో వికారాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ప్రయివేట్ డ్రైవర్లతో బస్సులు నడిపించారు. పోలీసుల భద్రత నడుమ ఇప్పుడిప్పుడే ఆర్టీసీ బస్సులు బయటికి వవచ్చాయి. దీంతో డిపోకు ఆర్టీసీ కార్మికులు భారీగా చేరుకున్న కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో కార్మికుల నినాదాలు పోలీసుల పకడ్బందీ మధ్య

సమ్మె ప్రశాంతంగా కొనసాగింది. ఖమ్మం డివిజన్ పరిధిలో మొత్తం 449 ఆర్టీసీ, 183 ప్రయివేట్ బస్సులు సమ్మె కారణంగా డిపోలకే పరిమితమయ్యాయి. అయితే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తగా డిపో, బస్టాండ్ పరిధిలలో 144 సెక్షన్ విధించారు. ఇప్పటికే తాత్కాలిక సిబ్బందిని నియమించిన అధికారులు పలు బస్సులను నడిపించారు.

### వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు - ఆర్టీసీ ఐకాస

ప్రభుత్వం విధించే డెడ్‌లైన్లకు కార్మికులు బెదరబోరని తెలంగాణ ఆర్టీసీ ఐకాస నేతలు స్పష్టం చేశారు. సమ్మె విషయంలో వెనక్కి తగ్గబోమని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ ఐకాస అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డితోపాటు పలువురు నేతలు ఎంజీబీఎస్‌ను సందర్శించారు. సమ్మె జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్మికులంతా సమ్మెలో పాల్గొంటూ దిగ్విజయం చేస్తున్నారని వారు అన్నారు. ఇకనైనా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంజీబీఎస్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మెతో కార్మికులు నైతిక విజయం సాధించారని ఈ సందర్భంగా ఐకాస నేతలు పేర్కొన్నారు.

### ప్రైవేటు డ్రైవర్లతో పాక్షికంగా నడుస్తున్న బస్సులు
### ఆర్టీసీ బస్సులపై రాళ్ల దాడి..

వికారాబాద్ జిల్లా నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సుపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరారు. బస్సు అద్దాలు పగిలిపోయాయి. వెనుక పోలీసు వాహనం సెక్యూరిటీగా వస్తున్నప్పటికీ బస్సు వస్తున్నా బస్సుపై రాళ్లు విసిరిన దుండగులు బైక్ పై పరారయ్యారు. ఈ దాడిలో బస్సు అద్దాలు పగిలి..ప్రయాణీకులకు చిన్నచిన్న గాయాలయ్యాయి. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న క్రమంలో వారే బస్సుపై రాళ్లు విసిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మరోపక్క పెద్దపల్లి జిల్లా మంథని మండలం మల్లేపల్లి ప్రధాని రహదారిపై వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై ఓ వ్యక్తి రాళ్లు విసిరాడు. పెద్దపల్లి నుంచి భూపాల పల్లి వెళ్తున్న బస్సుపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ బాలుడి తలకు గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని స్థానిక హాస్పిటల్ కు తరలించి చికిత్సనందిస్తున్నారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె జరుగుతున్న క్రమంలో ప్రభత్వం పోలీసులు సెక్యూరిటీతో బస్సులను నడిపిస్తున్నందుకు ఆర్టీసీ కార్మికులే బస్సులపై దాడులకు పాల్పడుతున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఇటువంటి ఘటనలతో ప్రయాణీకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

### ప్రైవేట్ దోపిడీ..

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు నిలిచిపోవటంతో ప్రైవేట్ వాహనదారులు ప్రయాణీకులను దోచుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో ప్రైవేట్ వాహనాలే ప్రయాణీకులకు దిక్కుకావటంతో వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తుంది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు రూ.500లకు పైగా ప్రైవేట్ వాహనదారులు వసూళ్లు చేస్తున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు రూ.600లకు పైగా వసూళ్లు చేస్తున్నారు. దీంతో పండుగ సమయంలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణీకులు బెంబేలెత్తిపోతున్నారు. కరీంనగర్ నుండి హైదరాబాదుకు ఏడు వందల రూపాయల వరకు వసూళ్లు చేస్తుండగా, నలభై తొమ్మిది కిలోమీటర్ల దూరం ఉన్న జగిత్యాలకు 150 రూపాయలు ప్రైవేట్ వాహన దారులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేట్ బస్సులు, స్కూల్ బస్సులను నడిపిస్తున్నప్పటికీ అవి ఏమాత్రం సరిపోకపోవటంతో బస్టాండ్‌ల వద్ద ప్రయాణీకులు పడిగాపులు కాస్తున్నారు. వచ్చిన రెండుమూడు బస్సులు కిక్కిరుస్తుండటంతో మహిళలు, చిన్న పిల్లలు ప్రయాణం సాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు.

# పోలీసుల అదుపులో రవిప్రకాశ్

### నిధుల మళ్లింపు కేసులో ఫిర్యాదు..అరెస్ట్
### - విచారిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ ను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో టీవీ 9 స్టూడియోకు వచ్చిన టైమ్ లో పోలీసు విధులకు ఆటంకం కలిగించారని రవిప్రకాశ్ పై అభియోగాలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసుల శనివారం రవిప్రకాశ్ ని అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి విచారిస్తున్నారు. టీవీ9 మాజీ సీఎఫ్‌వో ఎంకేవీఎన్ మూర్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొంత కాలంగా రవిప్రకాశ్ అజ్ఞాతంలో ఉన్నారు. పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. టీవీ9 సంతకాలు ఫోర్జరీ చేశారని, నిధుల గోల్ మాల్ చేశారని ఇప్పటికే కేసులు నమోదు చేశారు. పలుమార్లు రవిప్రకాశ్ ని విచారించారు. టీవీ9 సీఈవోగా ఉన్న సమయం లో నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డా రని, టీవీ 9లోగో అమ్మారని రవిప్రకాశ్ పై కేసులు ఉన్నాయి. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో 2 కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఏబీసీఎల్ బ్యాంకు ఖాతాల నుంచి రవిప్రకాశ్ అక్రమంగా రూ.12కోట్లకు పైగా నిధులను వాడుకున్నారని, మూడు విడతల్లో రూ.6 కోట్ల 36 లక్షలు విత్ డ్రా చేశారని ఫిర్యాదులున్నాయి. అలాగే డైరెక్టర్‌గా వ్యవహరించిన ఎంకేవీఎన్ మూర్తిపైనా నిధుల విత్‌డ్రా కేసు నమోదైంది. ఆయన రూ.5కోట్ల 97 లక్షలు విత్‌డ్రా చేయగా, మరో డైరెక్టర్ క్లిఫోర్డ్ పెరారీపైనా నిధుల విత్‌డ్రా కేసు నమోదు చేశారు పోలీసులు. పెరారీ రూ.5కోట్ల 97 లక్షలు విత్‌డ్రా చేసినట్లు సమాచారం. అలందా షేర్ హోల్డర్లు, డైరెక్టర్లకు సమాచారం ఇవ్వకుండా రవిప్రకాశ్ బృందం భారీ మొత్తంలో కంపెనీ నగదును విత్ డ్రా చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తమకు తాము భారీగా బోనస్‌లు కూడా ప్రకటించుకున్నారని, ఏబీసీఎల్ కంపెనీని టేకోవర్ చేసిన అలందా మీడియా డైరెక్టర్లు ఈ ఏడాది సెప్టెంబర్ 24న సమావేశమై వక్కదారి పట్టిన నిధులపై బోర్డులో చర్చించారు. అనంతరం రవిప్రకాశ్ అండ్ కోపై క్రిమినల్ కేసు పెట్టి చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీంతో అలంద మీడియా సెప్టెంబర్ 4న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఆరు దాటితే..ఆర్టీసీ ఉద్యోగులు కారు: మంత్రి పువ్వాడ



హైదరాబాద్, ,అక్టోబర్5: ఆర్టీసీ కార్మికుల సమ్మెపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి ఏమన్నారంటే.. 'శనివారం సాయంత్రం 6 గంటల్లోగా విధుల్లో చేరని కార్మికులు ఇక ఆర్టీసీ ఉద్యోగులు కారు. భవిష్యత్‌లో కూడా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టీసీ ఉద్యోగులుగా సంస్థ గుర్తించదు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో శాశ్వత ప్రత్యామ్నాయ రవాణా విధానానికి రూపకల్పన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నది. 3 నుంచి 4 వేల ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకుని నడపడం. ఆర్టీసీ బస్సులు నడపడానికి డ్రైవింగ్ లైసెన్సు కలిగిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఉద్యోగావకాశం కల్పించడం, వారికి తక్షణం తగు శిక్షణ ఇచ్చి, బస్సులను యాధావిధిగా నడపడం. 6 నుంచి 7 వేల ప్రైవేటు బస్సులకు రూట్ పర్మిట్లు ఇవ్వడం. ఇవాళ సాయంత్రం వరకు నెలకొన్న పరిస్థితిని ప్రభుత్వం గమనిస్తుందని' మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు.

# 4గంటల్లో 78వేల మంది ప్రయాణం

### - ఆర్టీసీ బంద్ ప్రభావంతో మెట్రోకు ప్రయాణికుల తాకిడి
### - ప్రయాణీకులతో కిక్కిరిపోయిన మెట్రో స్టేషన్‌లు

హైదరాబాద్, అక్టోబర్5(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావంతో మెట్రో స్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవటంతో ప్రయాణికుల చూపు మెట్రో రైలుపై పడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో తమతమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు ప్రయాణీకులు మెట్రో స్టేషన్లకు క్యూ కట్టారు. ఈ క్రమంలో మెట్రో సరికొత్త రికార్డ్ సృష్టించింది. తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రయాణించారు. కేవలం నాలుగు గంటల్లో 78వేల మంది ప్రయాణించినట్లు మెట్రో అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల వరకు 78వేల మంది మెట్రోలో ప్రయాణం చేశారని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సాధారణ రోజుల్లో ఈ సంఖ్య 42వేలుగా ఉండేదన్నారు. శనివారం సరికొత్త రికార్డ్ క్రియేట్ అయిందన్నారు. ఆర్టీసీ బస్సులు బంద్ కావడంతో మెట్రోకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. శనివారం ఉదయం నుంచి మెట్రో రైళ్లు కిక్కిరిసిపోయాయి. సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెట్రో రైలు సర్వీసుల సమయాన్ని పొడిగించింది. అర్ధరాత్రి 12.30 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి. ఉదయం 5 గంటల నుంచే మెట్రో సర్వీసులు ప్రారంభం అయ్యాయి. రద్దీగా ఉంటే ప్రతి 3నిమిషాలకు ఓ రైలును నడపుతామని అధికారులు చెప్పారు. రద్దీని తట్టుకోవడానికి వీలుగా అదనపు టికెట్ కౌంటర్లు, యంత్రాలు ఏర్పాటు చేశారు. అదనపు సిబ్బందిని నియమించారు. రద్దీ నిర్వహణ నిమిత్తం ఎల్బీనగర్, అమీర్‌పేట్, హైటెక్ సిటీ, సికింద్రాబాద్ ఈస్ట్, పరేడ్ గ్రౌండ్స్ వంటి ముఖ్యమైన స్టేషన్లలో మెట్రో సీనియర్ అధికారులు విధుల్లోకి దిగారు.

## ఆరు దాటితే.. ఆర్టీసీ ఉద్యోగులు కారు

- భవిష్యత్‌లోనూ ఆర్టీసీ ఉద్యోగులుగా సంస్థ గుర్తించదు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

హైదరాబాద్, అక్టోబర్5(ఆర్ఎన్ఎ) : శనివారం సాయంత్రం 6గంటలు దాటిన తరువాత ఆర్టీసీ ఉద్యోగులు తమ విధుల్లో చేరకపోతే వారిని ఆర్టీసీ ఉద్యోగులుగా పరిగణించమని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్‌లో కూడా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టీసీ ఉద్యోగులుగా సంస్థ గుర్తించదన్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో శాశ్వత ప్రత్యామ్నాయ రవాణా విధానానికి రూపకల్పన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మూడు ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదన్నారు. 3 నుంచి 4వేల ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకుని నడపడం జరుగుతుందని అన్నారు. ఆర్టీసీ బస్సులు నడపడానికి డ్రైవింగ్ లైసెన్సు కలిగిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఉద్యోగావకాశం కల్పించడం, వారికి తక్షణం తగు శిక్షణ ఇచ్చి, బస్సులను యాధావిధిగా నడుపుతామని అన్నారు. 6నుంచి 7 వేల ప్రైవేటు బస్సులకు రూట్ పర్మిట్లు ఇవ్వటం జరుగుతుందని, శనివారం సాయంత్రం వరకు నెలకొన్న పరిస్థితిని ప్రభుత్వం గమనిస్తుందని మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీపై ప్రత్యామ్నాయ విధానం ఖరారుకు ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ తెరపైన నాయకుండై
తెరతీసిన పిదప తూడు తేజోమయుడై
వరలెడి 'వినోదు ఖన్నా'
చిరయశమును బొందినాడు సినిమానటుడై!!

( అక్టోబర్ 6 వినోద్‌ఖన్నా జననం)



-రాధశ్రీ
సెల్: 9494481210

నేటి నిజం
ఆదివారం 6-10-2019

# ఇదంతా ప్రపంచీకరణ..

మన ప్రధానమంత్రి న్యూయార్క్‌లో బుధ, గురువారాలలో జరిపిన పెట్టుబడుల సమావేశానికి వివిధ దేశాలకు చెందిన నలబయి వాణిజ్య సంస్థల ప్రతినిధులు హాజరయ్యారట. ఎన్ని వేల లేదా ఎన్ని లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు విదేశాల నుంచి మన దేశానికి తరలివస్తాయన్నది మాత్రం ఇతమిత్థంగా వెల్లడి కాలేదు. "రానున్న నెలలలో పెద్ద ఎత్తున పెట్టుబడులను– మన దేశంలో– పెట్టడానికి అనేక వాణిజ్య సంస్థలు ముందుకు వచ్చాయి..."అని మాత్రమే పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య అభివృద్ధి మంత్రిత్వ విభాగం కార్యదర్శి గురుప్రసాద్ మహాపాత్రా వెల్లడించాడట. ఏళ్లతరబడి మన దేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుతున్న పెట్టుబడుల సమావేశాలలోను, మన ప్రధానులు, ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లి నిర్వహించిన సమావేశాలలోను "ఇన్ని లక్షల కోట్ల విదేశీయుల నిధులు మన దేశపు పారిశ్రామిక వాణిజ్య రంగాలకు పెట్టుబడులుగా తరలి రానున్నాయి..." అన్న ఆర్భాటపు ప్రచారం జరిగేది. న్యూయార్క్ సమావేశంలో అలాంటి నిర్దిష్ట నిధుల గణాంకాలు ఏవీ నిర్ధారణ అయినట్టు లేదు. ఇలా నిర్ధారణ కాకపోవడం వాస్తవానికి దగ్గరి వ్యవహారం. ఎందుకంటె గత రెండు దశాబ్దుల పెట్టుబడుల సమావేశాలలో "వాగ్దత్తమయిన"విదేశీయ నిధులలో ఎంతశాతం మన దేశానికి తరలివచ్చాయన్న విషయమై కచ్చితమైన గణాంకాలు లేవు. ఎన్ని 'అంగీకారాలు' వాస్తవ రూపం ధరించాయన్నది తెలియరావడం లేదు. ఇలాంటి స్థితిలో వల్ల వేలాది స్వదేశీయ సంస్థలు మూతపడుతున్నాయి. చివరికి ప్రతి రంగంలో రెండు–మూడు– నాలుగు విదేశీయ సంస్థలు మాత్రమే మిగిలే స్థితి దాపురించింది. పంపిణీ రంగంలో 'అమెజాన్', 'వాల్‌మార్ట్' సంస్థలు మాత్రమే వాణిజ్య ఆధిపత్యం వహిస్తుండడం నడుస్తున్న చరిత్ర. ఈ రంగంలో ఈ సంస్థలతో దీటుగా పోటీపడుతున్న స్వదేశీయ సంస్థలు ఉన్నాయా? ప్రభుత్వాలు చెప్పాలి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే! తినుబండారాల రంగంలో 'నెజల్'– నెస్లే–, మరికొన్ని విదేశీయ సంస్థలు 'దోపిడీ' కలాపాలను కొనసాగిస్తున్నాయి, విష రసాయన పూరితమైన తినుబండారాలను మన దేశపు వినియోగదారుల నోళ్లకెత్తుతున్నాయి. మనదేశపు స్థూల జాతీయ ఉత్పత్తి–గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్– జీడీపీ–లో 'సేవల'రంగం వాటా యాబయి ఆరు శాతం కావడం మన ప్రగతి ప్రమాణాలలోని వైచిత్రి. సేవల రంగం ప్రగతి తాత్కాలికమైనది, వౌలికమైనది కాదు. వ్యవసాయ, వౌలిక పారిశ్రామిక రంగాలలో లభించే ప్రగతి నిజమైన ప్రగతి. బ్రిటన్ దురాక్రమణదారులు మన దేశంలోకి చొఱబడే నాటికి ప్రపంచ వాణిజ్యంలో మన దేశపు వాటా నలబయి శాతం. చరిత్ర చెబుతున్న వాస్తవం ఇది. కానీ ప్రస్తుతం ప్రపంచ వాణిజ్య రంగంలో మన వాటా నాలుగు శాతం కూడ లేదు. ఇందుకు ప్రధాన కారణం మన వౌలిక పారిశ్రామిక ఉత్పత్తులు మూడు శతాబ్దులలో క్రమంగా అడుగంటిపోవడం. ఇది మొదటి వైపరీత్యం. రెండవ వైపరీత్యం విదేశాల నుంచి వస్తున్న సంస్థలు వౌలిక పారిశ్రామిక రంగాలలో పెద్దగా పెట్టుబడులను పెట్టడం లేదు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం పెద్దగా అవసరం లేని పంపిణీ రంగంలోకి, సేవల రంగంలోకి ఈ సంస్థలు చొఱబడిపోయాయి. 'బీమా' రంగంలోను, విద్యారంగంలోను విదేశీయ సంస్థల చొఱబాటు కొనసాగుతోంది. విదేశీయ సంస్థలు మన దేశంలో విమానాలను ఉత్పత్తి చేయడం లేదు. కేవలం విమాన సేవలను నిర్వహించడం ద్వారా వినియోగదారులను దోపిడీ చేస్తున్నాయి. ఈ 'దోపిడీ' పేరు "డైనమిక్ ప్రయిజింగ్"! అమెరికాతో 'అణు విద్యుత్' ఒప్పందాలు కుదిరాయి, ఫ్రాన్స్‌తో కుదిరాయి. పదేళ్లు గడిచిపోయినప్పటికీ ఈ దేశాల సంస్థలు ఎందుకని మన దేశంలో అణువిద్యుత్ ఉత్పత్తిచేయడం లేదు? విదేశీయ సంస్థల పెట్టుబడుల మాయాజాలం ఇది. విదేశీయ సంస్థలు మన దేశంలో సిమెంటును, ఉక్కును ఉత్పత్తి చేయడం లేదు. సేమ్యాలను, అప్పడాలను, ఆవకాయలను, శీతల పానీయాలను, రోగాలను పెంచే చాక్లెట్లను తయారు చేస్తున్నాయి. ఇదంతా ప్రపంచీకరణ. ఈ 'ప్రపంచీకరణ'ను ఆరంభించిన అమెరికా ప్రభుత్వమే ఇప్పుడు దీన్ని వదిలించుకొంటోంది. కనీసం ఇప్పటికైనా విదేశీయ సంస్థల 'పెట్టుబడుల' నుంచి విముక్తం చేయాలి!!

# కేసీఆర్ కిట్‌తో పెరిగిన ప్రసవాలు

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆందోళన

నల్గొండ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): కెసిఆర్ కిట్‌తో పాటు నగదు ప్రోత్సాహకాలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. దీనికితోడు ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. సీఎం కేసీఆర్ పేరుతో రూపొందించిన కిట్టు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన తరవాత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే గర్భిణుల సంఖ్య, ప్రసవాల సంఖ్య పెరిగింది. అయితే ఆసుపత్రిలో రక్ష పరీక్షలు చేయించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. నల్గొండ జిల్లా ఆసుపత్రికి నిత్యం 80 నుంచి 100 మంది గర్భిణులు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. వీరిలో 90 శాతం గర్భిణులకు రక్త పరీక్షలు అవసరమని వైద్యులు చీటీలు రాస్తున్నారు. రక్తపరీక్షల వార్డు విభాగానికి వెళ్లిన గర్భిణులకు నరక యాతన తప్పడం లేదు. జిల్లా కేంద్రాసుపత్రిలో రక్త పరీక్షలు పెద్ద పరీక్షగానే మారాయి. చిన్న పాటి రక్త పరీక్షల ఫలితానికి కూడా మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతోంది. మరి కొన్ని రకాల పరీక్షలకు ఫలితం రావడానికి వారం పాటు వేచి చూడాల్సి వస్తోంది. ఈ లోపు బాధితులకు రోగం రెట్టింపు కావడం వంటి ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. దీంతో పరీక్షలు చేసి ఫలితాలు ఇవ్వడానికి కొన్నింటికి గంటల సమయం, మరి కొన్నింటికి రోజు వరకు పడుతోంది. జిల్లాలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రక్త పరీక్షల ఫలితం అందే సరికి రోజులు గడుస్తున్నాయి. కొంత మంది గర్భిణులు నెలలో రెండు సార్లు రక్త పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రాసుపత్రిలో థైరాయిడ్ పరీక్షలు చేసే పరికరాలు ఒక్కటి కూడా లేవు. ఆసుపత్రిలో మైక్రోబయాలజీ పరికరాలు అందుబాటులో ఉన్నా రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు సరిగా చేయడం లేదు. ఇవి చేస్తే రోగులకు వచ్చిన వ్యాధికి ఎలాంటి మందు వేయాలి, యాంటీబయాటిక్స్ మాత్రలు వాడడం వల్ల ఎన్ని రోజుల్లో వ్యాధి తగ్గుతుంది అనే విషయాలు తెలుస్తాయి. కానీ ఇక్కడ ఒక్కరికి కూడా రక్తం కల్చర్ చేయక పోవడం వల్ల సరైన మందులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రక్త పరీక్షల సమస్యలు పరిష్కారం మార్గం చూపాల్సిన అవసరం ఉంది. పరీక్షల ఫలితాలు వెంటనే ఇవ్వకుండా మూడు రోజుల వరకు జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తుంది.

# హర్యానాలో గెలుపే లక్ష్యంగా బిజెపి వ్యూహం

## ప్రధాన ప్రచారకర్తల జాబితా విడుదల చేసిన పార్టీ

### జాబితాలో మోడీ, అమిత్‌షా,రాజ్‌నాథ్‌ల పేర్లు

ఛండీగఢ్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అందివచ్చే ఏ అవకాశాన్ని వదులుకోరాదని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగా ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రచార కర్తలుగా హేమాహేమీలను బరిలోకి దించుతోంది. ఇందుకు సంబంధించిన ప్రధాన ప్రచారకర్తల జాబితాను పార్టీ అధిష్ఠానం శుక్రవారం విడుదల చేసింది.

ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్‌షా ప్రధాన ప్రచారకర్తలుగా ప్రచారం సాగిస్తారు. వీరితో పాటు, బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, స్మృతి ఇరానీ, పీయూష్ గోయెల్, ముఖ్తార్ అబ్బాస్ నఖ్వి, వీకే సింగ్ కూడా

ప్రచారం సాగించనున్నారు. సహాయ మంత్రులు ఇంద్రజిత్ సింగ్, కృష్ణపాల్ గుర్జర్, రత్తన్ లాల్ కటారియా తదితరులు సైతం ప్రచారంలో పాల్గొంటారు. హేమమాలిని, సన్నీడియోల్, హన్స్ రాజ్ హన్స్ వంటి సెలబ్రెటీలు సైతం హర్యానా ప్రచార కర్తల జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

వీరంతా ర్యాలీలు, బహిరంగ సభలతో ఎన్నికల ప్రచారాన్ని రాబోయే రోజుల్లో ఉధృతం చేయనున్నారు. వరుసగా రెండోసారి రాష్ట్రంలో మనోహర్ లాల్ ఖట్టార్ నాయకత్వంలో విజయమే లక్ష్యంగా 75కు పైగా సీట్లు సంపాదించాలని అమిత్‌షా టార్గెట్ విధించారు. మొత్తం రాష్ట్రంలో 90 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. హర్యానాలో రాబోయే రోజుల్లో 100కు పైగా పబ్లిక్ ర్యాలీలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. అక్టోబర్ 21న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 24న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# పర్యావరణ విధ్వంసంతోనే వరదపోటు

హైదరాబాద్, అక్టోబర్ 5:గతేడాదితో పోలిస్తే ఈ యేడు వర్షాలు అధికంగానే కురిసాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా ఎక్కడా వాననీటి నిల్వలజాడ కానరావడం లేదు. జలశక్తి అభియాన్ పేరుతో అధికారులు పర్యటనలు చేస్తున్నా ఎక్కడా వాటి ఫలితాలు కానరావడం లేదు. నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు. దీనికితోడు ఇటీవల వరదలు దేశవ్యాప్తగా అతలాకుతలం చేశాయి. అయినా వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఎపి, తెలంగాణలో పలుప్రాంతాలతో పాటు ఉత్తరాదిలో వరదలు ముంచెత్తాయి. బీహార్ రాజధాని పాట్నా కూడా వరదనీటిలో మునిగిపోయింది. వరదలు వస్తే తోణ చర్యలు తీసుకునే అవకావం లేకుండా పోయింది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా రెండు రోజులుగా సాయంత్రం కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరవాసులు వణికిపోతున్నారు. క్యూములోనింబస్ మేఘాలతో పలు ప్రాంతాల్లో కుండపోత వాన కురిసిందని వాతావరణ శౄఖ అధికారులు చెబుతున్నారు. కేవలం గంట పాటు కురిసిన భారీవర్షానికే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడడం ఇప్పుడు పట్టణవాసులకు షరా మామూలయ్యింది. క్యుములోనింబస్ మేఘాలకు తోడు ఉపరిత ఆవర్తనం కారణంగా దేశవ్యాప్తంగా జోరు వానలు పడుతున్నాయి. ప్రకృతి విద్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేశాయి. ఖరీఫ్ సీజనులో వ్యవసాయం సాగేందుకు వీలుగా సమతుల్య వానలు పడాల్సి ఉండగా దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. ఆంధ్రప్రదేశ్ లోనే చూసుకుంటే రాయలసీమ, నెల్లూరు తీవ్ర వర్షాభావం ఎదుర్కొం టున్నాయి. మహారాష్ట్ర లోనూ అంతే విదర్భ ఇత్యాది ప్రాంతాల్లో అనావృష్టి తిష్ట వేయగా కొల్హాపూర్, సాంగ్లీ జిల్లాల్లో నదులు పొంగి పొర్లుతూ నష్టాలు కలిగిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల వలన కలిగే నష్టాలు విషాదకరం. నదీ ప్రవాహాలను సమర్ధవంతంగా నియంత్రించి నీటిని ఒడిసిపట్టే బదులు పర్యావరణ నిబంధనలను ప్రభుత్వమే ఉల్లంఘించి వరదనీటి ప్రవాహాలు అదుపు తప్పేందుకు కారణభూతమవుతోంది. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. ర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రాను రాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడితో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. మితిమీరిన గనుల, క్వారీల తవ్వకాలు, అడవుల విధ్వంసం, పట్టణీకరణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జల విపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తినప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంకపర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇప్పటికే 200కుపైగా మృతి చెందారని సమాచారం. లెక్కల్లోకి రాని మరణాలెన్నో చెప్పలేం. అధికారిక సమాచారం మేరకు కేరళలో 72 మంది, కర్నాటకలో 40, మహారాష్ట్రలో 40, గుజరాత్‌లో 31 మంది జలవిలయానికి చనిపోయారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జనజీవనం అస్తవ్యస్త మవుతోంది. లక్షలాది మందిని సహాయ శిబిరాలకు తరలించారు. బీహార్‌లో ఇంకా జలదిగ్బంధం నుంచి బయటపడలేదు. ఇటీవల ముంబయి, బెంగళూరు నగరాలను కలిపే 4వ నెంబర్ జాతీయ రహదారి పాడైపోవడంతో ఆ మార్గంలో భారీగా రవాణ స్తంభించింది. లక్షలాది ఎకరాల్లో పంటలకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు అపార నష్టం వాటిల్లింది. ఆర్థిక నగరం ముంబయి ఈ నెల రోజుల్లో మూడు తడవలు ముంపునకు గురైంది. ఉత్తరాఖండ్‌లో నదులు పొంగి పొర్లాయి. గువ రాష్టాల్లో కురిసిన వానలకు గోదావరి ఉప్పొంగి మన దగ్గర ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక, ఏజెన్సీ గ్రామాలు వారం రోజులుగా నీటి ముంపునకు గురయ్యాయి. తాజాగా వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్, ఉత్తరకోస్తా, ఒడిశా ప్రాంతాలలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం.. వాయువ్య రాజస్థాన్ నుంచి గాంగ్‌టక్ వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణిలో విలీనమైందని, దక్షిణ తమిళనాడు దాని పరిసర ప్రాంతాల్లో 0.9 కి.మీ. ఎత్తు వరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారిందని తెలిపారు.

# ఆర్టీసీ సమ్మెపై ప్రత్యమ్నాయ చర్యలు

## -కలెక్టర్లతో సమీక్షించిన మంత్రి పువ్వాడ

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమ్మె అనివార్యమైతే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి

మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్టీసీకి 44శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం. ఏ ప్రభుత్వం కల్పించని విధంగా ఆర్టీసీకి 15శాతం ఐఆర్, ప్రతినెల ఆర్టీసీ వారికి అసిస్టెన్స్ ఇస్తున్నాం. పక్క రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. మన రాష్ట్రంలో ఉన్న పథకాలు పక్క రాష్ట్రంలో లేవు. ఆర్టీసీ సమ్మె అనివార్యమైతే తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ స్కూల్, కాలేజీ, అద్దె బస్సులను ప్రత్యామ్నాయంగా నడిపించాలి. ప్రతీ డిపోకి ఒక పోలీస్ అధికారిని నియమించాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి. అన్ని జిల్లాల కలెక్టర్లు ఛాలెంజ్‌గా తీసుకుని పండుగ సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, అధికారులకు మంత్రి సూచించారు.

### ఆర్టీసీ డిపోల వద్ద 144 సెక్షన్

ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ, ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ మధ్య చర్చలు విఫలం కావడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కార్మికుల సమ్మె కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. అవసరమైతే పోలీస్ బందోబస్తు మధ్య సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'సమ్మెలో పాల్గొనే కార్మికులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు యంత్రాంగం తక్షణ అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రతీ డిపోకి ఒక పోలీస్ అధికారిని ఏర్పాటు చేస్తాం. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తే చట్టం తన పని అమలు చేస్తూ ఒకటే స్టాటజ్రీ ప్రకారం ముందుకు పోవాలి. అప్పుడే లక్ష్యాన్ని సాధించడానికి వీలుంటుందని' మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# పాట్నా వరదలకు ప్రభుత్వానిదే బాధ్యత

## ఆరోపణలు గుప్పించిన కేంద్ర మంత్రి

పాట్నా,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): పాట్నాలో జరిగిన జల దిగ్బంధానికి ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీలే కారణమని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. జలదిగ్బంధానికి ఇప్పటికే తాము పాట్నా ప్రజలకు క్షమాపణలు చెప్పామని అన్నారు. భారీ వర్షాల కారణంగా జరిగిన జల దిగ్బంధానికి నితీశ్ కుమార్, సుశీల్ మోదీలే బాధ్యులని మండిపడ్డారు. వీరితో పాటు అధికారులపై కూడా ఆయన మండిపడ్డారు. నిర్లక్ష్యానికి బాధ్యులపై అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసినా, అధికారులు ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని గిరిరాజ్ సింగ్ ప్రశ్నించారు.

# నిండుకుండలా సాగర్ జలాశయం

## పర్యాటకుల రాకతో కళకళ

## మత్స్యకార కుటుంబాల్లో ఉపాధి ఆనందం

నల్లగొండ,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాకులు రాక పెరిగింది. వరుస సెలవులతో దసరాకు ముందే పర్యాటకుల రాక పెరిగింది. నిత్యం ఇక్కడికి సందర్శకులు భారీగా తరలి వస్తున్నారు.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా నిండుకుండను తలపిస్తోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపిం చింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరిం చుకున్నాయన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్సులు జారీచేసి ప్రభుత్వం వరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో వలలో పడ్డ ఒక్కో చేప 20కిలోల వరకు ఉండి పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు. చేపల బరువును బట్టి కిలోకు రూ.40 నుంచి రూ.100 వరకు దళారులు మత్స్యకారులకు చెల్లిస్తున్నారు. దీంతో చేపల వేట రూపంలో వచ్చే ఆదాయమంతా దళారుల జేబుల్లోకి వెళ్లిపోతోంది.

# ఇమ్రాన్ వ్యాఖ్యలపై మండిపడ్డ భారత్

## ప్రధానిగా ఉన్న వ్యక్తి జిహాద్ పిలుపునిస్తారా

## ఆయన హుందాతనాన్ని కోల్పోయారన్న రవీశ్ కుమార్

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ తీరును భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. జిహాద్ చేయాలని బహిరంగంగా పిలుపునివ్వడంపై తీవ్రంగా మండిపడింది. భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇమ్రాన్ ఖాన్ జిహాద్‌కు పిలుపునివ్వడం సాధారణ విషయం కాదన్నారు. ఇటువంటి ప్రవర్తన ఆయన నిర్వహిస్తున్న పదవి హుందాతనానికి తగినది కాదన్నారు. ఇమ్రాన్ ఖాన్ అమెరికాలో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం స్వదేశానికి తిరిగి వస్తూనే ఆదివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కశ్మీరీలకు మద్దతుగా నిలిచినవారు జిహాద్ చేస్తున్నారని, ప్రపంచం కశ్మీరీలకు మద్దతివ్వకపోయినప్పటికీ, పాకిస్థాన్ అండగా నిలుస్తుందని అన్నారు. ఇది పవిత్ర యుద్ధం. అల్లా సంతోషించడం కోసం మేము దీనిని చేస్తున్నాం అని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై రవీశ్ కుమార్ స్పందిస్తూ, పాకిస్థాన్ ఓ పొరుగు దేశం వ్యవహరించవలసిన తీరులో నడచుకోవడం లేదన్నారు. ఇది ఆయన ఇమ్రాన్ ఖాన్ నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి పదవి హుందాతనానికి తగినది కాదు. పాకిస్థాన్ ఓ పొరుగు దేశం వ్యవహరించవలసిన తీరులో నడచుకోవడం లేదు. జిహాద్ కోసం ఈ విధంగా బహిరంగంగా పిలుపునివ్వడం సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్ సాధారణ సభలో కూడా రెచ్చగొట్టే విధంగా, బాధ్యతారహితంగా మాట్లాడారని రవీశ్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను ఎలా నిర్వహించాలో ఆయనకు తెలియదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. భారత దేశంపై పవిత్ర యుద్ధానికి ఆయన బహిరంగంగా పిలుపునివ్వడం చాలా తీవ్రమైన విషయమని తెలిపారు. ఇది సాధారణ విషయం కాదన్నారు.




న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన సిఎం కెసిఆర్.

# అమిత్‌షాతో ముగిసిన సిఎం కేసీఆర్ భేటీ

## పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ
## కృష్ణా-గోదావరి ప్రాజెక్టుపై ప్రస్తావన

న్యూఢిల్లీ,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): నీళ్లు, నిధుల అంశాలే ప్రధాన ఎజెండాగా ఢిల్లీ పర్యటనకు వెళ్లిన తెలంగాణ సీఎం కేసీఆర్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి విభజన సమస్యలతో పాటు, పలు అంశాలపై చర్చించినట్లు కేసీఆర్ మీడియాతో వివరించారు. ఆంధ్రప్రదేశ్‌తో కలిసి సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన కృష్ణా - గోదావరి నదుల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా కాళేశ్వరం, పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒకదానికి జాతీయ ప్రాజెక్టు హోదా తమకు ఎప్పటికీ ప్రాధాన్య అంశమేనని కేసీఆర్ తేల్చి చెప్పారు. ఈ భేటీ అమిత్ షా, కేసీఆర్‌ల మధ్య దాదాపు 40 నిమిషాలపాటు కొనసాగింది.

గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. రెండు జీవనదుల అనుసంధానం జరిగితే తెలుగు రాష్ట్రాల్లోని బీడు భూములన్నింటికీ సాగునీరు అందించే అవకాశం ఉండటంతో.. అతి కీలకమైన ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాలని సీఎం కేసీఆర్ ప్రధానిని కోరే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధానిని చాలాసార్లు కోరినప్పటికీ ఇవ్వలేదు. తాజాగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కూడా ఉండటంతో ఈ రెండింటిలో ఒకదానికి జాతీయ హోదా ఇవ్వాలని కోరనున్నారు. రాష్ట్రంలో హైవేల విస్తరణపై కూడా చర్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్‌రోడ్‌పై ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించింది. కంటోన్మెంట్ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు రక్షణశాఖకు చెందిన భూములను ఇవ్వాలని ప్రధానిని సిఎం కోరనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ మంచినీటి కోసం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చిన తర్వాతే.. కేంద్రం ఘర్‌ఘర్ జల్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర పథకానికి మిషన్ భగీరథను అనుసంధానం చేయాలని సీఎం ప్రధానిని కోరనున్నట్టు సమాచారం. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయాన్ని అందించే అంశంపైనా ప్రధానితో సిఎం మాట్లాడనున్నట్లు సమాచారం.

# బినామీ ఆస్తులంటే జప్తు చేసుకోండి

## దాడులు ఎందుకు జరిగాయో త్వరలో వెల్లడిస్తా
## ఎసిబి దాడులపై మధుసూధన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తాను ఏ తప్పు చేయలేదు..తనకు బినామీ ఆస్తులుంటే..ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చంటున్నారు తెలంగాణ ఇంటర్ జేఏసీ నేత, ప్రభుత్వ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి అన్నారు. ఏసీబీ జరుపుతున్న దాడులపై ఆయన శుక్రవారం మధ్యాహ్నం స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ...ఈ రైడ్ ఎందుకు జరుగుతుంది ? కారణాలు ఏంటీ ? ఎందుకు నన్ను టార్గెట్ చేశారు ? ఇలాంటి అనే ప్రశ్నలకు తాను ఇప్పుడే సమాధానం చెప్పనన్నారు. అధ్యాపకుల సంఘం నాయకుడిగా..అనేక విషయాలపై మాట్లాడినట్లు చెప్పారు. అయితే..తన దగ్గర రూ. 50 లక్షలు దొరికినట్లు ప్రచారం జరుగుతోందని..ఇది వాస్తవం కాదన్నారు. కేవలం తన దగ్గర లక్ష రూపాయలు మాత్రమే ఉన్నట్లు..అలాగే ఫ్యామిలీ అకౌంట్లలో మినిమం బ్యాలెన్స్ తప్పా ఐదు రూపాయలు ఎక్కువ లేవన్నారు. ఈ విషయాలు ఏసీబీ వారు చెబుతారన్నారు. అంతకుమించి ఎక్కువగా డబ్బులు ఉంటే..అరెస్టుకు సిద్ధమని ప్రకటించారు. బినామీ అనే ఆలోచన రాదని..అలాంటి అవకాశం లేదని కొట్టిపారేశారు. మహేందర్ ఎవరో తనకు తెలియదన్నారు. మధుసూధన్ రెడ్డిపై ఏసీబీ అధికారులు దాడులు చేయడం కలకలం రేపింది. ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతో దిల్ సుఖ్ నగర్ లోని ఆయన నివాసంలో సోదాలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఇంటితో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. పలు డ్యాక్యుమెంట్లు పరిశీలిస్తున్నారు. మధుసూదన్ రెడ్డి తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడిగా చాలా కాలంగా పనిచేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి పదవిలో ఉన్నారు. 2007 ఇంటర్ పేపర్ లీకేజ్‌లో మధుసూదన్ రెడ్డిని కీలక సూత్రధారిగా ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. 3 ప్రైవేట్ కాలేజీలతో కుమ్మక్కయ్యారని, మార్క్స్ మేనేజ్ చేశారని.. ప్రమోషన్ల పేరుతో జూనియర్ లెక్చరర్ల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

# ప్రధానికి లేక రాసిన వారిపై కేసు

## ముజఫర్‌పూర్‌లో నమోదు చేసిన పోలీసులు
## మండిపడ్డ ఆదూరి గోపాలకృష్ణన్

ముజఫర్‌పూర్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై బీహార్‌లో కేసు నమోదైంది. ఈ జాబితాలో చరిత్రకారుడు రామ చంద్ర గుహ, సినీ ప్రముఖులు మణిరత్నం, రేవతి, అపర్ణాసేన్ తదితరులు ఉన్నారు. చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ముజఫర్పూర్ పోలీసులు తెలి పారు. సమాజంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తు న్నారంటూ.. న్యాయవాది సుధీర్ ఓజా స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ విచారణ అనంతరం ఆగస్ట్ 20న తుది తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా లేఖలో సంతకాలు చేసిన అందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. మూకదాడులకు పాల్పడడం, దాడుల సందర్భంగా జైశ్రీరామ్ నినాదాన్ని వినియోగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ 49 మంది ప్రముఖులు ఈ ఏడాది జులైలో ప్రధానికి లేఖ రాశారు. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ఈ విషయాన్ని ప్రస్తావించినా.. సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని లేఖలో పేర్కొన్నారు. అప్పట్లో ఈ లేఖ సంచలనమైంది. అయితే దీనికి కౌంటర్‌గా మరో 62మంది వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రధానికి మరో లేఖ రాశారు. రాజకీయ కోణంలో.. పక్షపాత ధోరణితో మణిరత్నం వంటి ప్రముఖులు లేఖ రాశారని ఆరోపించారు. కౌంటర్ లేఖ రాసిన వారిలో కంగనా రనౌత్, మధుర్ బండార్కర్, ప్రసూన్ జోషి తదితరులు ఉన్నారు.

ఇదిలావుంటే ముజఫరాపూర్ జిల్లాలో కేసు నమోదు కావడం సంచలనమవుతోంది. దీనిపై ప్రముఖ దర్శకనిర్మాత అదూర్ గోపాలకృష్ణన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లేఖలో సంతకాలు చేసిన అదూర్‌తో సహా మొత్తం 49 మందిపై ముజఫరాపూర్ పోలీసులు శుక్రవారంనాడు కేసు నమోదు చేశారు. దీనిపై అదూర్ మాట్లాడుతూ, దేశంలో అసాధారణ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. గాంధీజీని చంపిన నాథూరాం గాడ్సేని స్మరించుకుంటూ మనదేశంలోనే గాంధీజీ నమూనాపై ఒక మహిళతో సహా పలువురు కాల్పులు జరిపినట్టు విన్నాం. అలాంటి వారిపై ఏ కోర్టూ కేసు నమోదు చేయదు. ఇప్పుడు అదే వ్యక్తి పార్లమెంటు సభ్యుడు కూడా అని అదూర్ తెలిపారు. దేశంలో జరుగుతున్న ఘటనలపై భయాలు వ్యక్తం చేస్తూ రాసిన లేఖ ఆధారంగా పిటిషన్ వేస్తే ఏ కోర్టు అయినా దానిని విచారణకు స్వీకరించవచ్చా? కేసు నమోదు వార్తే నిజమైతే, న్యాయవ్యవస్థను అనుమానించాల్సి వస్తుందని ఆయన అన్నారు.

# తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ఇటీవలే తారా స్థాయికి చేరిన బంగారం ధరలు చూసి ప్రజలు అమ్మో అని గుభేలుమన్నారు. బంగారం కొనుగోలుదారులకు దసరా కంటే ముందుగానే వారు పండగను వైభవంగా జరుపుకుంటున్నారు. దానికి కారణం తగ్గిన బంగారం ధరలే. వరుసగా మూడో రోజు బంగారం ధరలు తగ్గాయి. ఇక వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేసేందుకు షాపుల ఎదుట బారులు తీరుతున్నారు. చిన్న మొత్తంలో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది సరైన సమయం.

బంగారం ధరల విషయానికి వస్తే ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర హైదరాబాద్ లో ముప్పై ఎనిమిది వేల నూట తొంభై రూపాయలు, విశాఖపట్టణంలో ముప్పై తొమ్మిది వేల నూట యాభై రుపాయలు, ప్రొద్దుటూరులో ముప్పై ఏడు వేల ఆరు వందల యాభై రూపాయలు, చెన్నైలో ముప్పై ఏడు వేల ఎనిమిది వందల డెభ్భై రూపాయలుగా ఉంది. ఇక ఇరవై రెండు క్యారెట్ల ఆభరణాల బంగారం పది గ్రాముల ధర హైదరాబాద్ లో ముప్పై ఆరు వేల మూడు వందల ఎనభై రూపాలు. విశాఖపట్నంలో ముప్పై ఆరు వేల పది రూపాయలు, ప్రొద్దుటూరులో ముప్పై నాలుగు వేల ఏడు వందల అరవై రూపాయలు, చెన్నైలో ముప్పై ఆరు వేల మూడు వందల రూపాయలుగా ఉంది. వెండి కిలో ధర హైదరాబాదు నలభై ఐదు వేల నాలుగు వందలు, విశాఖపట్నంలో నలభై ఆరు వేల రెండు వందలు, ప్రొద్దుటూరులో నలభై ఐదు వేల ఏడు వందలు, చెన్నైలో నలభై తొమ్మిది వేల మూడు వందల వద్ద ముగిసింది. ముహూర్తాలు మళ్ళీ ప్రారంభం కాబోతున్న సందర్భంగా బంగారం కొనుగోలు సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది అని నిపుణులు వెల్లడిస్తున్నారు.

# వైభవంగా బతుకమ్మ సంబరాలు

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీనివాస గౌడ్

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ముగింపు వేడుకలు అంబరాన్ని తాకేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హుస్సేన్‌సాగర్ జలాశయంతో పాటు బతుకమ్మ ఘాట్ పరిసరాలను శుక్రవారం బోట్ ద్వారా వెళ్లి పరిశీలించారు. సద్దుల బతుకమ్మ పండుగ రోజు లాల్ బహదూర్ స్టేడియం నుండి ట్యాంక్‌బండ్ లోని బతుకమ్మ ఘాట్ వరకు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వేలాదిమంది కళాకారులతో బతుకమ్మల ర్యాలీని నిర్వహించాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా ట్యాంక్‌బండ్, హుస్సేన్‌సాగర్ జలాశయంలో వెలుగుల బతుకమ్మలను వినూత్నంగా ఏర్పాటు చేయటంతో ప్రజల నుండి భారీ స్పందన లభించింది. ముగింపు రోజు బతుకమ్మ సంబురాల విజయోత్సవాన్ని పురస్కరించుకుని మిరుమిట్లు గొలిపే రీతిలో భారీ బాణసంచా ను కాల్చటం వంటి ముందస్తు ఏర్పాట్లను మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# టీఎస్ ఐపాస్ దేశానికే ఆదర్శం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): టీఎస్ ఐపాస్ దేశానికే ఆదర్శమని ఐటి శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సీఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ మీటింగ్‌కు మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ కాకతీయ టెక్స్‌టైల్ మెగా పార్క్‌తో లక్షా 13 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వరిధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. త్వరలో తెలంగాణలో డ్రై పోర్టు ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. దేశంలో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మన దేశంలోని నగరాలతో కాకుండా ప్రపంచ దేశాలతో పోటీ పడినప్పుడే అభివృద్ధి మరింత పెరుగుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిన మోడీ

## మండిపడ్డ రాహుల్

తిరువనంతపురం,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): భారత్ కు అతిపెద్ద బలమైన ఆర్థికవ్యవస్థను ప్రధాని మోదీ నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. శుక్రవారం వయానాడ్ లో ఆయన పర్యటించారు. మోదీ హయాంలోనే దేశంలో రికార్డు స్థాయిలో నిరుద్యోగం పెరిగిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఒకే పార్టీ ఒకే నాయకుడు, భిన్నత్వంలో ఏకత్వం అనే రెండు సిద్ధాంతాల మధ్య పోరు జరుగుతోందన్నారు. ఇ సందర్భంగా బీజేపీ విధానాలను తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని అన్ని వర్గాల వారి కోసం పాటుపడుతుందని అన్నారు. అటు..ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాటాడిన వారిపై కేసులు బనాయించి కటకటాల పాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు రాహుల్ గాంధీ. వీటన్నింటికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇరాక్‌లో ప్రజాందోళనలు: 34 మంది మృతి

బాగ్దాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): ఇరాక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజాందోళనల్లో 34 మంది మరణించగా, మరో 1500 మంది గాయపడ్డారు. దక్షిణ ఇరాక్ లోని పలు నగరాల్లో సాగుతున్న ప్రజల నిరసనలతో ఇరాక్ సర్కారు కర్ఫ్యూ విధించింది.

31 మంది నిరసనకారులతోపాటు ముగ్గురు సెక్యూరిటీ అధికారులు మరణించారు. నిరసనకారులకు, సెక్యూరిటీ బలగాలకు మధ్య సాగిన పోరులో 1518 మంది ప్రజలు, 423 మంది ఇరాకీ సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారని ఇరాక్ మానవహక్కుల కమిషన్ సభ్యుడు అలీ అక్రం అల్ బయాతీ చెప్పారు.

మహదీ పాలనలో ఇరాకీలు నిరుద్యోగసమస్యతో పాటు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. పాలకుల అవినీతిపై ప్రజలు ఆందోళనకు దిగారు.నిరసనల నేపథ్యంలో ఇరాక్ ప్రధాని ఆదిల్ అబ్ద్ మహదీ సెక్యూరిటీ బలగాలతో అత్యవసర సమావేశం జరిపారు. నసీరియాహ్, దివానీయాహ్, బస్రా నగరాల్లో నిరసనకారులు ఆందోళనకు దిగారు.

# పాక్ విదేశాంగ మంత్రి అసహనం

## జవాబు చెప్పలేక జర్నలిస్టుపై చిందులు

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): కశ్మీర్ అంశంపై ఏయే దేశాలు పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచాయో చెప్పాలంటూ ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నతో పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీ తోక తొక్కిన తాచుపాములా కస్సుమన్నారు. ఏ దేశం తరపున పనిచేస్తున్నావ్?' అంటూ అతడిపై చిందులు తొక్కారు. కశ్మీర్ అంశంపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ 58 సభ్య దేశాలు' తమకు మద్దతుగా నిలిచాయంటూ పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్ టీవీ చానెల్ 'ఎక్స్‌ప్రెస్ న్యూస్'లో దీని ప్రస్తావన వచ్చింది. '50 పైగా సభ్యదేశాలు' కశ్మీర్‌పై పాకిస్తాన్‌కు మద్దతు పలికాయని ఇటీవల ఖురేషీ కూడా ట్వీట్ చేయడంతో... ఇదే విషయాన్ని జర్నలిస్టు జావేద్ చౌదరి తన ఇంటర్వ్యూలో ప్రస్తావించించారు. దీంతో ఒక్కసారిగా ఖురేషీ ఆగ్రహోద్రిక్తుడయ్యారు. మీరు ఎవరి ఎజెండా ప్రకారం పనిచేస్తున్నారు? ఐక్య రాజ్య సమితి ఏ దేశాలు పాకిస్తాన్‌కు మద్దతిస్తున్నాయో చెప్పమని అడుగుతున్నావా? మీకు నచ్చింది మీరు రాసుకోండి అంటూ కేకలు వేశారు. ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యలను ట్విటర్‌లో ఎందుకు సమర్థించారంటూ మళ్లీ ప్రశ్నించడంతో... లేదు.. లేదు.. నేను ఏ ట్వీట్‌లో రాశానో చూపించండి. ప్రధాని ఇమ్రాన్ రాసింది కాదు. నేనెక్కడ రాశానో చూపించండి. అంటూ ఎదురు ప్రశ్నించారు. దీంతో జర్నలిస్టు ఆయన పోస్టును ప్రింట్ తీసి చూపించారు. అయినప్పటికీ ఖురేషీ స్పందిస్తూ.. నేను ఏం చెప్పానో దానికే కట్టుబడి ఉంటాను. ఇదంతా చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది.. మీరు ఎవరి ఎజెండాతో పనిచేస్తున్నారు.. అంటూ సమర్థించుకున్నారు. వాస్తవానికి యూఎన్‌హెచ్‌ఆర్‌సీలో కేవలం 47 సభ్య దేశాలు మాత్రమే ఉండగా... 58 దేశాల మద్దతు అంటూ ఇమ్రాన్, 50కి పైగా సభ్య దేశాల మద్దతు అంటూ ఖురేషీ ట్విటర్లో ప్రకటించి నవ్వులపాలయ్యారు. యూఎన్‌హెచ్‌ఆర్‌సీలో 13 ఆఫ్రికన్ దేశాలు, 13 ఆసియా-ఫసిఫిక్ దేశాలు, 8 లాటిన్ అమెరికా-కరీబీయన్ దేశాలు, పశ్చిమ ఐరోపా-ఇతర దేశాలు 7, తర్పూ ఐరోపా దేశాలు 6 సహా మొత్తం 47 సభ్యదేశాలు ఉన్నాయి.

# ఆర్టీసీ దుస్థితికి ప్రభుత్వమే కారణం

## అనివార్యంగానే కార్మికుల సమ్మె పిలుపు
## సమస్యలను పరిష్కరించకుండా నాన్చారు
## మండిపడ్డ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఆర్టీసీ నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఇప్పటివరకు ఆర్టీసీకి పూర్తి స్థాయి ఎండీని ప్రభుత్వం నియమించలేదని.. ఆర్టీసీపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో రవాణా వ్యవస్థలో ప్రైవేటు వాహనాల సంఖ్యను తగ్గిస్తామని కేసీఆర్ చెప్పారని.. కానీ ఈ ఐదేళ్ల కాలంలో ప్రైవేటు వాహనాలు అదనంగా మరో 5 శాతం పెరిగాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని వివరించారు. నిర్వహణ లోపం, బకాయిలు సకాలంలో చెల్లించ కపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెబాట పట్టాల్సివచ్చిందని జీవన్ రెడ్డి విమర్శించారు. వేతన సవరణ కాలపరిమితి ముగిసి 30 నెలలు గడిచినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. మీరు ప్రగతి భవన్‌లో దసరా పండగ చేసుకుంటారు.. కానీ ఆర్టీసీ కార్మికులు పండగ జరుపుకోవద్దా?అని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. సమ్మెలో పాల్గొని ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కార్మికులు అనుకోవడం లేదని.. తప్పని పరిస్థితుల్లో వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టారన్నారు. ఆర్టీసీలో 10 వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవలేదని జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల ప్రభుత్వం తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రగతిభవన్ వదిలి సచివాలయానికి రారని.. అందుకే నూతన సచివాలయ నిర్మాణం అవసరం లేదన్నారు. నిర్మాణం వాయిదా వేస్తే ఆ డబ్బుతో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించవచ్చని జీవన్ రెడ్డి సూచించారు.

# మన హెలికాప్టర్‌ను మనమే కూల్చాం

## తప్పిదం వల్లే ఎమ్ఐ-17 కూలింది: ఐఏఎఫ్

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 27న భారత్-పాక్ మధ్య వైమానిక పోరు జరుగుతున్న సమయంలో బద్గాం సమీపంలో ఎమ్ఐ-17 వీ5 హెలికాప్టర్ కుప్పకూలిన విషయం తెలిసిందే. అయితే అది మన తప్పిదం వల్లే జరిగిందని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వైమానిక దళాధిపతి ఎయిర్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్ భదూరియా అంగీకరించారు. ఐఏఎఫ్ ప్రయోగించిన క్షిపణి ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వివరించారు. దీనిపై ఏర్పాటు చేసిన కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ పూర్తయిందన్నారు. ఆ సమయంలో క్షిపణి ప్రయోగాల్ని నిర్వహిస్తున్న అధికారులు ఎమ్ఐ-17 హెలికాప్టర్‌ను శత్రుదేశానికి చెందిన యుద్ధ విమానంగా భావించడమే ప్రమాదానికి దారి తీసిందన్నారు. ఈ ఘటనలో ఆరుగురు వాయుసేన సైనికులు, ఓ పౌరుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనికి కారణమైన అధికారులపై చర్యలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పాక్ క్షిపణి వల్లే ఈ హెలికాప్టర్ కూలిందని అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఏడాది భారత వాయుసేనబాలాకోట్‌పై దాడి సహా పలు ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించిందని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాకేశ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్-400 క్షిపణి వ్యవస్థతో ఐఏఎఫ్ సామర్థ్యం ఇంకా పటిష్ఠం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు భవిష్యత్తులో బాలాకోట్ లాంటి దాడుల్ని జరపడానికి వాయుసేన సిద్ధంగా ఉందని పరోక్షంగా పాక్‌ను హెచ్చరించారు. ఇటీవల డ్రోన్ల ద్వారా భారత్‌లోకి పాక్ ఆయుధాల్ని చేరవేస్తోందని వస్తున్న వార్తలపై స్పందించారు. డ్రోన్ల రూపంలో కొత్త ముప్పు ముంచుకొస్తోందని.. దీన్ని ఎదుర్కోవడానికి అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఇది గగనతల ఉల్లంఘనల పరిధిలోకి వస్తుందని.. ఈ కోణంలోనూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలాకోట్ దాడిలో భారత్ మిగ్-21 కోల్పోగా.. పాక్ ఎఫ్-16ని కోల్పోయిందని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్‌ను ఆర్థికంగా బలోపేతం చేస్తున్న మోడీ

## -లోన్‌మేళాలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): భారత దేశాన్ని ఆర్థికంగా బలమైన వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రధాన మంత్రిమోదీ లక్ష్యమని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చిన్నవ్యాపారులకు చేయూతనివ్వడానికే ముద్రా బ్యాంక్‌ను ఏర్పాటైందన్నారు. వ్యాపారులే కాదు, నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం చేసుకునే వివిధ రకాల వ్యాపారాలకు ముద్రా బ్యాంక్ ద్వారా రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. శుక్రవారం నగరంలోని బంజారాహిల్స్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకుల రుణ గ్రహీతల సమ్మేళనం జరిగింది. ఈకార్యక్రమానికి మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయి రుణ గ్రహీతలకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ రానున్న రోజుల్లో పేదల కోసం మరిన్ని రుణాలు అందజేస్తామన్నారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో రీపేమెంట్ చేస్తే మరింత రుణం పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఆర్థిక మాంద్యంలో కూడా లోన్‌ల విషయంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు ఈసందర్భంగా ఆయన బ్యాంక్‌రుణాలకు సంబంధి ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా సందర్శించారు.

# ఢిల్లీ మెట్రోలో మరో కొత్త కారిడార్

న్యూఢిల్లీ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ):ఢిల్లీ మెట్రో మరో కొత్త కారిడార్ ను ప్రారంభించింది. ద్వారకా-నజఫ్ గఢ్ మధ్య కొత్తగా ఏర్పాటు చేసిన కారిడార్ ను కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4.2 కిలోమీటర్ల పొడగున ఈ లైన్ ను ఏర్పాటు చేసింది. ఇందులో1.5 కిలోమీటర్లు భూగర్భ మార్గం ఉన్నట్టు మెట్రో అధికారులు తెలిపారు. కాగా అయితే అర్బన్ ప్రాంతాలను కలుపుతూ తొలిసారిగా మెట్రో ఈ లైన్ ప్రారంభించింది. దీంతో ఢిల్లీ మెట్రో274 స్టేషన్లతో 377 కిలో మీటర్లతో ఢిల్లీ ప్రజలకు సేవలందిస్తోంది .

## ఏపీ వార్తలు

# ఏలూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు

## శంకుస్థాపన చేసిన సిఎం వైఎస్ జగన్

ఏలూరు,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఏలూరు నగరంలో రూ. 266 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే ఆధునిక ప్రభుత్వ వైద్య కళాశాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఏలూరు నగరంలో పర్యటిస్తున్న సీఎం వైఎస్ జగన్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఏలూరు జిల్లా ఆసుపత్రిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఆమోదముద్ర వేశారు. దీనిలో భాగంగా ప్రభుత్వం మెడికల్ కళాశాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే రూ.266 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ మెడికల్ కాలేజీలో తొలుత 100 సీట్లు కేటాయిస్తారు. దీని ఏర్పాటుకు మెడికల్ కౌన్సిల్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో 25 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే సేకరించి, కాలేజీ నిర్మాణానికి సిద్ధంగా ఉంచగా, అవసరమైతే మరికొంత స్థలాన్ని సేకరించేందుకు మంత్రి నాని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కళాశాల ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి రానుండడంతో పాటు, పేద ప్రజలకు ఆధునిక వైద్యసేవలు మరింత చేరువ కానున్నాయి. వైద్య రంగంలో మరిన్ని పరిశోధనలు, ఆధునిక వైద్య సౌకర్యాలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని జిలా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ కళాశాలకు రాష్ట్ర సర్కారు రూ.266 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019?2020 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులను వినియోగించుకునేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అక్టోబర్ 1న జీవోనెంబర్ 114ను ప్రభుత్వం విడుదల చేసింది. వైద్య కళాశాల ప్రారంభంలో మొదటి ఏడాది 100 సీట్లు భర్తీ చేస్తారు. నాలుగేళ్ళకాలంలో వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన, హాస్టల్ ఏర్పాటుకు భారీఎత్తున భవంతులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారు. ఎంసీఐ నిబంధనల మేరకు మొత్తం 380 మంది విద్యార్థులకు గాను హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 518 బెడ్లతో అన్ని వసతులు కలిగి ఉంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు ఏలూరులో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఏ విధమైన ఆటంకాలు లేవు. ఇప్పటికే జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు, సేవలు, బెడ్స్, స్థలం, మెడికల్ బృందం ఎంసీఐ నిబంధనల మేరకు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఆప్తాల్మజీ, టీబీ అండ్ సీడీ, స్కిన్ అండ్ ఎన్‌టీడీ, ట్రామాకేర్, ఐసీయూ ఇలా అనేక విభాగాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లా కేంద్ర ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రిపేర్ని నాని తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్నకారు: నలుగురు మృతి

కడప,అక్టోబర్5 (ఆంఎన్ఎ): కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిన్నమండెం మండలం కేశాపురం వద్ద కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, ఒకరు గాయపడ్డారు. హర్షవర్ధన్, బుజ్జి, భూదేవి సంఘటనా స్థలంలోనే చనిపోయారు. క్షతగాత్రుడిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మరణించాడు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కడపకు చెందిన వీరంతా బెంగళూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కారు వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొడంతో ప్రమాదం జరిగిందని అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

### భవానీ భక్తులరాకతో ఇంద్రకీలాద్రిపై రద్దీ

### అమ్మవారిని దర్శించుకున్న నటి హేమ

విజయవాడ,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామునుంచే పోటెత్తారు. రాత్రి 11 గంటల వరకు దర్శనానికి అవకాశమున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులుమొక్కులు తీర్చుకుంటున్నారు. కాగా సీఎం జగన్మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకోనున్నారు. రాష్ట్ర మంత్రులు ఓంకారం వద్ద సీఎంకు స్వాగతం పలకనున్నారు. ప్రభుత్వం తరఫున సీఎం హోదాలో కనకదుర్గ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇకపోతే ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ దర్శనానికి భవానీ భక్తులు రాక ప్రారంభమైంది. దీక్షల విరమణకు వివిధ ప్రాంతాల నుంచి భవానీ భక్తులు వచ్చారు. అయితే ఏర్పాట్లు సరిగా చేయలేదని, కనీసం మౌలిక వసతులు కూడా అధికారులు కల్పించలేదని గురు భవానీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆలయ ఈవోను కలిశారు. అయితే మాల ఎవరు వేసుకోమన్నారంటూ అవమానంగా మాట్లాడారని భవానీలు ఆవేదన వ్యక్తం చేశారు.

# బ్రహ్మోత్సవ శోభతో అలరారుతున్న తిరుమల

## మోహినీ రూపంలో అభయమిచ్చిన శ్రీవారు

## భారీగా తరలివస్తున్న భక్త జనం

తిరుమల,అక్టోబర్ 5(ఆర్ఎన్ఎ): సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం ఉదయం శ్రీవారు మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై భక్తులకు దర్శనమిచ్చాడు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై భక్తులకు అభయమిచ్చాడు. ఏనుగులు, అశ్వాలు ఠీవిగా ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, డ్రమ్స్ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ ఊరేగింపు అత్యంత రమణీయంగా జరిగింది. మోహినీ అవతారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగివుందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలోలులు కాక తప్పదని స్వామివారు ఈ రూపంలో చాటి చెబుతున్నారు. రాత్రి 7 నుంచి 12 గంటల వరకు విశేషమైన గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. తిరుమలలో బ్రహ్మోత్సవ శోభతో మాడవీధుల్లో నవోవేంకటేశాయ నామస్మరణ మార్మోగుతోంది. తిరుమలకు వేంచేసిన భక్తులు కలియుగ వైకుంఠాన్ని తిలకించి పులకించిపోయారు. సప్తగిరులపై ఉన్న వృక్షాలన్నీ విద్యుత్ దీపాల అల్లికలతో దేదీప్యమానంగా కాంతులీనుతున్నాయి. రంగురంగుల పుష్పాలు, మామిడి తోరణాలు, పచ్చటి అరటి మొక్కలతో భక్తకోటికి స్వాగతం పలికింది. మృదుమధురంగా వినిపిస్తున్న వేదఘోష వీనుల విందు చేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు మెల్లగా తరలివస్తున్నారు. ఓ వైపు బ్రహ్మాండంగా ఉత్సవలను నిర్వహిస్తూనే మరోవైపు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. మొత్తంగా తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వాహనసేవకు ముందు కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అశేష భక్తకోటి నుంచి స్వామివారు హారతులందుకున్నారు. వాహనసేవలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సంబరం మొదలు కావడంతో వాహన సేవలకు ప్రాధాన్యం ఏర్పడింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవేంకటేశ్వర స్వామి అధిరోహించే ఒక్కొక్క వాహనానికి ఒక్కో చరిత్ర ఉంది. ప్రతి వాహనం నుంచి శ్రీనివాసుడు ఒక్కో సందేశం ఇస్తారు. విశిష్టాద్వైత సిద్దాంతం ప్రకారం భగవంతుడు శేషి. స్వామి శేషవాహనంపై ఊరేగడం ద్వారా భక్తులకు ఈ శేషశేషి సంబంధాన్ని బోధించినట్లు దర్శనం ఇచ్చారు. వేద మంత్రాలతో సేనాధిపతి, అనంత, సుదర్శన, గరుడులను పిలిచి ఆలయ అర్చకులు ప్రసన్నం చేసుకున్నారు. భక్తుల గోవింద నామాలు, ఘనాపాఠీల వేదమంత్ర ఘోషల మధ్య అష్టదిక్పాలకులు, పంచలోకాధిపతులు సాక్షీభూతంగా ఉత్సవాలు సాగుతున్నాయి. ఉత్సవాలకు వేంచేసిన ముక్కోటిదేవతల సమక్షంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న ఉత్సవాలను కనులారా వీక్షించి తరించాలని భక్తకోటి తిరుమలకు తరలివస్తోంది.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సిఎం వైఎస్ జగన్

## వాహనమిత్ర ప్రారంభోత్సవంలో మంత్రి పుష్ప శ్రీవాణి

విజయనగరం,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక అండగా ఉంటాను అన్న సిఎం జగన్ అన్న తన మాట నిలబెట్టుకున్నారని డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణీ అన్నారు. నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో వైఎస్ఆర్ వాహన మిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. జిల్లాలో అర్హులైన 10,922 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ.10,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. బాషా మూవీలో హీరో చెప్పినట్టు ' నేను ఒకసారి చెబితే వంద సార్లు చెప్పినట్టే ' అన్నట్టుగా జగన్ అన్న రియల్ హీరో కాబట్టి ఒక్క మాట ఇస్తే వందసార్లు నిలబెట్టుకుంటారని అభివర్ణించారు. కొవ్వూరు లో 2013 లో మా అమ్మా నాన్న తో కలిసి ప్రయాణం చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒక ఆటో వ్యక్తి తమను ఆదుకున్నాడని, ఆటో డ్రైవర్లు గొప్ప సేవా తత్పరత కలిగిన వారని పొగిడారు. నిరుపేద ప్రజల కోసం నాణ్యత కలిగిన బియ్యం, వైద్యానికి ఆరోగ్య శ్రీ, పిల్లల చదువులు కోసం అమ్మ ఒడి, ఆడపిల్లల పెళ్లి కోసం వైఎస్సార్ పెళ్లి కానుక కింద రూ.50 వేలు నుంచి లక్ష రూపాయలు అందిస్తోందని తెలిపారు. జిల్లాలో 28 వేల మంది ఆటో, టాక్సీ వాలాలు ఉండగా కేవలం 10 వేల మందికి వచ్చిందని, మిగిలిన వారు కూడా సమస్యలు అధిగమించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, సంబంగి చిన్న వెంకట అప్పలనాయుడు, కొండపల్లి అప్పల నాయుడు, ఎమ్మెల్సీ రఘు వర్మలు మాట్లాడుతూ.. ఈ దేశంలో..రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని పాలన జగన్మోహన్ రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. పాలన ప్రజల వద్దకు తెచ్చేలా సచివాలయం వ్యవస్థ తీసుకు వచ్చారన్నారు. పాలకులే కాదు అధికారులు కూడా సక్రమంగా పని చేస్తేనే మంచి పాలన సాధ్యమని, అవినీతి రహిత పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. పార్టీలకి అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వార్డుల్లో తిరిగి అనేక సమస్యలను గుర్తించి..ప్రజా అవసరాలను గుర్తించి మంత్రి బత్స సత్యనారాయణ చేతుల మీదుగా శత శంకుస్థాపనలకు శ్రీకారం చుదుతున్నామని వెల్లడించారు. తాగు నీటి కి ఇబ్బంది లేకుండా వర్షాలు కురిసేందుకు కలెక్టర్ మొక్కలు నాటుతూ..మొక్కల కలెక్టర్ గా పేరొందారని ప్రశంసించారు. విజయనగరం ఏర్పడి 40 ఏళ్ళు అయినా ఇంకా కొందరు తినడానికి తిండి లేకుండా ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయని, ఆ స్థితిలో నిరుద్యుగులు ఆటోలు వేసుకొని జీవిస్తున్నారని, వారిపై పోలీసులు లేనిపోని కేస్ లు పెట్టకూడదని మనవి చేశారు. వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని, వారిలో మార్పు తీసుకురావాలని సూచించారు. చదువుకొని కూడా ఉపాధి లేక కూలీ పనులకు వెళుతున్న వారి పిల్లలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రియంబర్స్మెంట్ తో మంచి చదువులు చదివించారని చెప్పారు. జగన్ సీఎం అయ్యాక వారికి నాలుగున్నర లక్షల ఉద్యోగుల ఇచ్చి పేద వాళ్ళ కళ్ళలో సంతోషం నింపారని పేర్కొన్నారు. ఎంపీ బెల్లన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు ఈ రూ.10 వేలు వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం పొగిడింపు సీఎం జగన్ మోహన్ రెడ్డి పొగిడింపు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎవరైనా ఇప్పటికీ పథకాన్ని అనివార్య కారణాల వల్ల నమోదు చేయించుకోని పక్షంలో ఆటో, మెక్సి క్యాబ్ డ్రైవర్స్ ఈ లోపు ఆఫ్ లైన్, ఆ÷-లనైన్ లో నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ హరి జవహర్ లాల్ మాట్లాడుతూ.. పేద, కార్మిక వర్గం, నిరుపేదలు ఇబ్బందుల పైనే ప్రభుత్వం ఎక్కువ దఅష్టి పెడుతోందన్నారు. మిగిలిన జిల్లాల కంటే విజయనగరం జిల్లా ఈ పథకాన్ని పొందుకోవడంలో ముందుందని తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

### డ్వామా పిడిలతో పనుల ప్రగతిపై సమీక్ష

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అమరావతి,అక్టోబర్5 (ఆంఎన్ఎ): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. తాడేపల్లిలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ గిరిజా శంకర్ తోపాటు13 జిల్లాల డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల గురించి చర్చించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, గతేడాది కంటే కనీసం 20 శాతం అధికం గా పనిచేయాలని సూచించారు. ప్రగతిపై ప్రతి నెల ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ల ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహించాలని, ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(నరేగ) కింద ఇవ్వాలని కలెక్టర్లకు మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీ, మురుగునీటి శుద్ది వంటి కార్యక్రమాలు చేపట్టి, ప్రాధాన్యత క్రమంలో గ్రామస్థాయిలో ప్రతిపాదిత పనులు చేయాలని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీలు, స్కూళ్లలో వసతులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు స్కూళ్లను ఆధునీకరించాలని అన్నారు. 40 వేలకు పైగా వున్న పాఠశాలలకు ప్రహరీ, మరుగు దొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అంతర్గత రహదారులు, హార్టీకల్చర్, మత్స్య పెంపకం వంటివి ప్రోత్సహించాలని సూచించారు. 11వేలకు పైగా వున్న గ్రామ సచివాలయాలకు ఉపాధి హామిని వర్తింపజేయాలని... అవసరైన చోట్ల కొత్త భవనాలు నిర్మించాలని.. ప్రస్తుతం ఉన్న వాటికి అదనపు గదుల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రం నుంచి నిధులు మరింత రావాలంటే, నరేగ పురోగతిలో ముందుండాలని మంత్రి సూచించారు. అదే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఫిర్యాదులు వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని.. అలాగే మొక్కల సంరక్షణ, ఎ÷-లాంటేషన్‌లపై దృష్టి సారించాలని, ట్రీగార్డుల కోసం అన్ని జిల్లాల నుంచి కొటేషన్లు తెప్పించుకుని తక్కువ రేటును నిర్ణయించాలని అన్నారు. చిత్తూరు జిల్లాలో కూలీలు వలసలు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి సేవ పథకం కింద గ్రామ సచివాలయాలు నిర్మించాలని, వెంటనే వాటికి టెండర్లు పిలవాలని సూచించారు. 'ఉద్దానం' వంటి ప్రాంతంలో వెంటనే నరేగ కింద ప్లాంటేషన్ చేపట్టాలని, ప్రభుత్వం అందించే పక్కా గృహాలకు 90 రోజుల ఉపాధి పని దినాలను సద్వినియోగం చేయాలని పేర్కొన్నారు. నరేగ కింద ఎంపీలు ప్రతిపాదించే పనులకు ఎంపీ నిధులు కూడా తీసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.

# ఆటో డ్రైవర్ అవతారమెత్తిన మంత్రి అవంతి

### బీచ్ రోడ్డు నుంచి మూడు కిలోమీటర్ల ర్యాలీ

### వైఎస్సార్ వాహన మిత్రకు మంత్రి శ్రీకారం

విశాఖపట్టణం,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు శుక్రవారం ఆటో డ్రైవర్ అవతారం ఎత్తారు. ఆటో హ్యాండిల్ పట్టి.. కాసేపు డ్రైవర్‌గా మారిపోయారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ఆటో డ్రైవర్లతో మమేమకం అయ్యారు. ఆటో డ్రైవర్ షర్టు వేసుకుని ఆటో నడిపారు. కాగా విశాఖ బీచ్‌రోడులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర నుంచి గురజాడ కళాక్షేత్రం వరకూ మూడు కిలోమీటర్ల మేర భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గురజాడ కళాక్షేత్రంలో వైఎస్సార్ వాహన మిత్ర కార్యక్రమాన్ని మంత్రి అవంతి శ్రీనివాస్ ప్రారంభించారు. లబ్దిదారులకు పదివేల రూపాయల చొప్పున చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ...'తొలిసారిగా ఆటో నడిపే అవకాశం మీ ద్వారా కలిగింది. ఏ ఉద్యోగం లేని వ్యక్తులకు తొలి ఉద్యోగం ఇచ్చేది ఆటో మాత్రమే. రవాణా సదుపాయాలు లేకపోతే గ్రామీణ ప్రాంతాలలో కష్టాలు ఎలా ఉంటాయో నాకు బాగా తెలుసు. గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేది ఆటో డ్రైవర్లే. ఆటో డ్రైవర్ల కష్టాలను స్వయంగా చూసి వారి కోసం వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ప్రతి ఏటా పదివేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తాం. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి. మీలో నాయకత్వ లక్షణాలు ఉన్న ఆటో డ్రైవర్లకి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తాం. ఇది పేదల ప్రభుత్వం... పేదల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం. ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు. సీఎం వైఎస్ జగన్ ప్రజలను ప్రేమించే వ్యక్తి...వేధించే వ్యక్తి కాదు. ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుంది. విశాఖ జిల్లాలోనే ఆటో డ్రైవర్లకు రూ.10వేల చొప్పున ఏటా రూ.25 కోట్లు అందించాం' అని అన్నారు. ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ.. 'ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆనందంగా ఉండాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర పథకం తీసుకువచ్చారు. మీ అందరి కష్టాలను నేరుగా పాదయాత్రలో చూసిన వ్యక్తి సీఎం జగన్. అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనది. ప్రజలందరి సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయబోతున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినయ్ చంద్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, పిట్ల ఉమా శంకర్ గణెశిష్, భాగ్యలక్ష్మి, అదీప్ రాజ్, జివిఎంసి కమిషనర్ సృజన , విఎం ఆర్డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, అక్కరమాని విజయ నిర్మల, కొయ్యా ప్రసాద్ రెడ్డి , డిటిసి రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రజా సంకల్పయాత్రలో 2000 కిలోమీటర్ల సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లాలో 2018 మే 14న ఆటో, కారు, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. మాట ఇచ్చిన చోటే ..ఇవాళ వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏలూరులో ప్రారంభించారు.

# ఎన్నిమంటలు రాజేసినా లాభం లేదు

### -బాబు తీరుపై మండిపడ్డ విజయసాయి

అమరావతి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): చంద్ర'జ్యోతి' ఎన్ని మంటలు రాజేయాలని చూసినా లాభం లేకుండా పోయిందనేదే సారు అసలు బాధ అంటూ.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ట్విటర్ పలు అంశాలపై ఆయన స్పందించారు. సోషల్ మీడియా వాల్స్‌పై ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు పోస్ట్ చేస్తారు. అనాగరిక దూషణలుంటే ఫేస్‌బుక్‌కు ఫిర్యాదు చేయొచ్చు. మీ పుత్ర రత్నం పెట్టిన ట్వీట్లు సుమతి శతకాల్లా కనిపిస్తున్నాయా బాబు గారూ సిగ్గు లేని బతుకులు ఎవరివో ఐదుగురి పేర్లు చెప్పమంటే ఆ తండ్రీకొడుకుల పేర్లు ఫస్టుంటాయి. ఆ లిస్టులో కిరసనాయిలు తప్పని సరిగా ఉంటాడు. అంతగా అన్‌పాపులర్ అయ్యారు వీళ్లు. ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛకు వీరి నిర్వచనాలు వేరేలా ఉంటాయి. జన్మలో మారరు. వైఎస్సార్సీపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పైన నీచపు రాతలు రాసేందుకు వేల మందిని నియమించి, 24/7 కాల్ సెంటర్లను నిర్వహించిందెవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు చంద్రబాబు గారూ. మీ బానిస పత్రికలు, చానళ్లు ఎంత దాచి పెట్టినా సోషల్ మీడియా మీ అరాచకాలన్నింటినీ బయట పెట్టింది. అందుకేనా ఈ ఏడుపు? అధికారం కోల్పోయినప్పటి నుంచి చంద్రబాబు తీవ్ర మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్నారు. తనను అందరూ మర్చిపోతున్నారనే భయం వెంటాడుతోంది. పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని రాయించినా సీఎం జగన్ స్పందించక పోవడంతో ఆయనలో నిస్పృహ కట్టలు తెంచుకుందని విజయ సాయిరెడ్డి మండిపడ్డారు.

# ఇచ్చిన మాట మేరకు వాహనమిత్ర పథకం

### ఏలూరులో ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్

### ఆటో డ్రైవర్లకు నేరుగా ఖాతాల్లో పదివేల నగదు

### ఈ నెలాఖరు వరకు పథకంలో చేరేందుకు అవకాశం

ఏలూరు,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): ఆటో కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఏలూరు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వాహన మిత్ర పథకాన్ని సీఎం ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు నెలల్లోనే హామీ నెరవేరుస్తున్నామని తెలిపారు. సొంత ఆటో ఉన్న డ్రైవర్ల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని ప్రకటించారు. ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఐదేళ్లలో రూ.50 వేలు అకౌంట్‌లో వేస్తామని వెల్లడించారు. ఇలాంటి ఆర్థికసాయం దేశ చరిత్రలో ఎవరూ ఎక్కడా చేయలేదని పేర్కొన్నారు. ప్రతీ పథకం అర్హులందరికీ అందేలా చూసామన్నారు. సంక్షేమ పథకాల అమలులో కులం, మతం, పార్టీలు చూడమని స్పష్టం చేశారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద.. 1.75 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 1.73 లక్షల మందికి వర్తింపజేశామన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సొంత ఆటో, వైట్ రేషన్‌కార్డు ఉంటే చాలు ఈ పథకానికి అర్హులుగా వెల్లడించారు. మాటకు కట్టుబడి, చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకానికి శ్రీకారం చుట్టామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయమే ఏలూరు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ తొలుత ప్రభుత్వ వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో 'వైఎస్సార్ వాహన మిత్ర'ప్రారంభించారు. ఈ పథకం కింద లబ్ది పొందే వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమ ంలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు పేర్ని నాని, ఆళ్ల నాని తానేటి వనిత, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కలెక్టర్ ముత్యాల రాజు, ఇతర ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. 'వైఎస్సార్ వాహన మిత్ర'పథకంతో తమకు చేయూతనిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఆటో డ్రైవర్లు పుష్ప గుచ్ఛాలు, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను గుర్తించి ఈ పథకం ప్రారంభించినందకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజల నుద్దేశించి సీఎం జగన్ మాట్లాడుతూ.. '2018, మే 14న పాదయాత్రలో ఆటో కార్మికులకు హామీ ఇచ్చాను. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీ అమలు చేశాం. ఆటో కార్మికులను కష్టాలను కళ్లారా చూశా. అందుకే వైఎస్సార్ వాహన పథకాన్ని రూపొందించాం. అర్హత ఉన్న ప్రతీ అర్హుడికి ఈ పథకం అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇంకా అర్హులు ఎవరైన ఉంటే వారికి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తున్నాం. వారికి వచ్చే నెల నుంచి నగదును అందిస్తాం. ఇలాంటి ఆర్థిక సహాయం దేశ చరిత్రలో ఎక్కడా లేదు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇలాంటి బృహత్తర పథకాలు అమలవుతున్నందుకు గర్వంగా ఉంది. రానున్న రోజుల్లో ఇలాంటి మరెన్నో పథకాలతో ప్రతీ పేదవాడిని ఆదుకుంటామని మాట ఇస్తున్నానని చెప్పారు.

### చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చాం. ప్రతి గ్రామంలో బెల్టు లేకుండా రద్దు చేశాం. మద్యం దుకాణాలను 4,380 నుంచి 3,500కు తగ్గించాం. అంతేకాకుండా మద్యం షాపులు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నాం. మద్యం షాపుల పక్కన పర్మిట్ రూమ్‌లను రద్దు చేశాం. అయితే గాంధీ జయంతి రోజు మద్యం షాపులు తెరిచారని ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసారని మండిపడ్డారు. మీరు చెప్పండి గాంధీ జయంతి రోజు ఎక్కడైనా మద్యం దుకాణాలు తెరిచి ఉన్నాయా? అని అడిగారు రాష్ట్రంలో మంచి జరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్దిని చూసి అభినందించాల్సింది పోయి విమర్శిస్తున్నారు. అయితే వారు చేస్తున్న విమర్శలను నేను ఏమాత్రం పట్టించుకోను. పేద ప్రజల ముఖంపై చిరునవ్వు కోసం తమ ప్రభుత్వం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంది' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

# సమిష్టి కృషి చేస్తే విజయం మనదే

### -నేతలతో మంత్రి జగదీశ్వర్ రెడ్డి సమీక్ష

సూర్యాపేట,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): నాయకులందరం సమిష్టిగా కష్టపడి హుజూర్‌నగర్ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో మంత్రి శుక్రవారం మధ్యాహ్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యావత్ ప్రజానీకం అభివృద్ధి, సంక్షేమం వైపు చూసున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పయనించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. లీడర్‌ను క్యాడర్‌ను సమన్వయం చేయడమే ఇంఛార్జీల ముందున్న కర్తవ్యమని అన్నారు. కారు గుర్తుకు ఓటేసేందుకు సన్నద్ధమౌతున్న ఓటర్లు గుర్తుల గందరగోళానికి గురికాకుండా బూత్ కమిటీలను అప్రమత్తం చేయాలని సూచించారు. హుజూర్‌నగర్‌లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్, సూర్యాపేట జెడ్పీచైర్మన్ దీపికా యుగందర్ రావు, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, ఎన్. భాస్కర్‌రావు, రవీందర్ నాయక్, నోముల నరసింహాయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, రాష్ట్ర సివిల్ సైప్లై కార్పొరేషన్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై సూర్యాపేటలో ప్రజాప్రతినిధులతో సమీక్షించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి.

# నలుగురు వలంటీర్లపై వేటు!

### దసరా మామూళ్ల వసూళ్లపై అధికారుల ఆగ్రహం

అమరావతి,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ):ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిచడమే లక్ష్యంగా.. దేశంలోనే తొలిసారిగా గ్రామ వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ సర్కార్ నెలకొల్పిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఏపీలో ప్రతీ 50 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీర్ సేవలందిస త్నాడు .ఇటీవలే గ్రామ వాలంటీర్లకు సీఎం జగన్ దిశానిర్దేశర చేశారు. పనిలో అలసత్వం, అవినీతి ఆరోపణలు వస్తే వెంటనే ఉద్యోగాలలో నుంచి తీసేస్తామని కూడా వార్నింగ్ ఇచ్చారు. వలంటర్లు తప్పు చేస్తే ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని ప్రజలకు స్వయంగా సీఎం జగన్ పిలుపునిచ్చి ఒక టోల్ ఫ్రీ నంబర్ ను కేటాయించారు.

తాజాగా విధి నిర్వహణలో చేతివాటం ప్రదర్శించిన నలుగురిని ఉద్యోగం నుంచి తొలగించారు. కృష్ణా జిల్లా రుద్రవరంలో ఈ ఘటన జరిగింది. మచిలీపట్నం మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వలంటీర్లు చుక్కా విజయవర్మ, లంకపల్లి ఒలివ, గాడెల్లి సునీల్ కుమార్, తెనాలి వనజలు ఈ నెల 1వ తేదీన పెన్షన్ల పంపిణీ సమయంలో ఒకొక్కరి నుంచి రూ.50/-లు దసరా మాముళ్ళుగా వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అధికారులు విచారణకు ఆదేశించగా వసూళ్ళకు పాల్పడినట్టు గ్రామ కార్యదర్శి నివేదిక ఇచ్చారు. కార్యదర్శి నివేదిక, నియామక ఉత్తర్వులలో పేర్కొన్న విధంగా అవినీతికి పాల్పడిన ఆ నలుగురు వాలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏపీ వార్తలు

# ఆర్థికస్థితి బాగు లేకున్నా సంక్షేమ కార్యక్రమాలు

### తిరుపతి సంతకం పేరుతో బాబు విమర్శలు అర్థరహితం
### మండిపడ్డ వైకాపా నేత రామచంద్రయ్య

విజయవాడ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినప్పటికీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రామచంద్రయ్య అన్నారు. చంద్రబాబుకు ప్రజలు 23 అసెంబ్లీ సీట్లు ఇచ్చినవ్పటికీ ఆత్మ పరిశీలన చేసుకోకుండా ఉన్మాదిలా మాట్లాడుతున్నారని టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిపై నిప్పులు చెరిగారు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రామచంద్రయ్య మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి కి సిఎం వెళ్ళినప్పుడు సంతకం పెట్టలేదని మాట్లాడం సరికాదన్నారు. మనిషికి భక్తి ఉందా లేదా అనేది ముఖ్యమని.. జగన్మోహన్ రెడ్డి ఒక్క తిరుపతినే కాదు అనేక పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నారని తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు ఫూలిష్ గా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కనకదుర్గమ్మవారి భూములను చంద్రబాబుకు నచ్చిన వారికి ఇచ్చుకోలేదా..అని ప్రశ్నించారు. దుర్గమ్మ గుడిలో క్షుద్ర పూజలు చేయించింది నువ్వు కాదా..తిరుమలలో పోటును తవ్వించింది నువ్వు కాదా.. అని అడిగారు. తిరుపతిలో సంతకం అనేది జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగతమని, ప్రజలకు హామీ ఇచ్చిన సంతకం అమలు చేయకపోతే తప్పు అని సి.రామచంద్రయ్య చెప్పారు. చంద్రబాబు చేసిన సంతకాల పరిస్థితి ఏమిటో చంద్రబాబు సమాధానం చెప్పాలని కోరారు.

రుణమాఫీ, డ్వాక్రా, బెల్ట్ షాపులు, బంగారం ఇంటికి తెస్తామని అనేక సంతకాలు చంద్రబాబు చేశారని, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క సంతకాన్ని చంద్రబాబు అమలు చేయలేదని చెప్పారు. నీచ సంస్కృతికి చంద్రబాబు విష వృక్షం.. అని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డికి సంబంధం లేని విషయాలను చంద్రబాబు మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్టీఆర్ పై రాయలేని భాషలో మాట్లాడింది చంద్రబాబు కాదా, విష సంస్కృతికి మూల పురుషుడు చంద్రబాబు... అని నిప్పులు చెరిగారు. జగన్మోహన్ రెడ్డి కుటంబ సభ్యులపై ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాలో రాతలు రాయించారని, టిడిపి కేంద్ర కార్యాలయం వేదికగా జగన్మోహన్ రెడ్డిపై, ఆయన కుటుంబ సభ్యులపై వ్యతిరేకంగా ప్రచారం చేయిస్తున్నారని రామచంద్రయ్య ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం చేస్తుంటే చంద్రబాబు మాత్రం ఆయనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. లోక కల్యాణం కోసం జగన్మోహన్ రెడ్డి యజ్ఞం చేస్తుంటే రాక్షసులు అడ్డుకుంటునట్లు చంద్రబాబు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు ప్రతినిత్యం బురద జల్లుతున్నారని, చంద్రబాబు తన కోవర్ట్ లను బిజెపిలోకి పంపారని విమర్శించారు. చంద్రబాబు ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోలేదని, ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వమే లిక్కర్ షాప్ లను నడిపిందని గుర్తు చేశారు.చంద్రబాబు విమర్శలపై బిజెపి నాయకులు స్పందించాలని కోరారు. టిడిపి అనేది ముగిసిన అధ్యాయనం అని, పోలవరాన్ని ఎటిఎం లా మార్చుకున్నారని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీనే చెప్పారని సి.రామచంద్రయ్య నిప్పులు చెరిగారు.

# జనసేనకు ఆకుల గుడ్‌బై

### - రాజీనామా పత్రాన్ని పవన్‌కు పంపించిన సత్యనారాయణ
### - మళ్లీ బీజేపీలో చేరే అవకాశం!

విజయవాడ, అక్టోబర్5(ఆర్ఎన్ఎ) : జనసేన పార్టీకి సీనియర్ నేత ఆకుల సత్యనారాయణ షాకిచ్చారు. గత కొన్ని రోజులుగా పవన్ కల్యాణ్ తీరుపై అసహనంగా ఉన్న ఆయన.. పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని శనివారం పవన్‌కు పంపించారు. కాగా పవన్ నేతృత్వంలోని జనసేన ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైన నేపథ్యంలో కొన్ని రోజులుగా పలువురు సీనియర్ నేతలు పార్టీని వీడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రావెల కిషోర్‌బాబు, చింతల పార్థసారథి, మారంశెట్టి రాఘవయ్య, అద్దేపల్లి శ్రీధర్, డేవిడ్ రాజు జనసేనకు గుడ్‌బై చెప్పారు. తాజాగా సత్యనారాయణ కూడా పార్టీని వీడటం.. మరి కొంత మంది నేతలు కూడా ఇదే బాటలో నడుస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో జనసేన శ్రేణులు ఆందోళనలో ఉన్నారు. ఇక ఆకుల సత్యనారాయణ విషయానికి వస్తే... 2014 ఎన్నికల్లో బీజేపీ తరపున రాజమండ్రి నియోజకవర్గం నుంచి ఆకుల సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరారు. ఈయనకు రాజమండ్రి లోక్ సభ స్థానం కేటాయించారు పవన్ కళ్యాణ్. కానీ ఆయన ఎన్నికల్లో ఘోర ఓటమి చెందారు. ఇక అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఆయన పార్టీ మారుతారని అప్పట్లోనే ప్రచారం జరిగింది. పవన్ కళ్యాణ్ తీరుపై అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆకుల కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. ఉభయ గోదావర జిల్లాల్లో బలమైన సామాజిక వర్గంగా కాపులున్నారు. వీరు వైసీపీలో చేరితే..పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో మారుతుండడం గమనార్హం. జనసేన నుంచి నాయకులు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోతుండటంతో జనసేన శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదిలాఉంటే నాయకులు పార్టీని వీడుతున్నా అధినేత పవన్ పెద్దగా పట్టించుకోవటం లేదని సమాచారం. నాయకులను బుజ్జగించి తమ పార్టీలోనే ఉంచేలా ప్రయత్నాలు చేయకపోవటంతో ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారని తెలుస్తుంది. మరోవైపు ఆకుల సత్యనారాయణ ఏ పార్టీలో చేరుతారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. మళ్లీ ఆయన బీజేపీలో చేరుతారని ఆయన అనుచరులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆయన వైసీపీలో చేరుతారని, ఇప్పటికే వైసీపీ నేతల నుంచి పిలుపు అందిందని, అందుకే ఆకుల జనసేనకు రాజీనామా చేశారని ప్రచారం సాగుతుంది.

# స్వల్పంగా తగ్గిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ,అక్టోబర్5 (ఆంఎన్ఎ): దేశంలో చమురు ధరలు వరుసగా రెండోరోజూ తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, కోల్‌కతాలలో పెట్రోల్ ధర లీటరుకు 18 పైసలు తగ్గగా, చెన్నైలో 19 పైసలు తగ్గింది. ఇక డీజిల్ విషయానికి వస్తే ఢిల్లీ, ముంబయి, కోల్‌కతాలలో లీటంకు 8 పైసలు తగ్గగా, చెన్నైలో 9 పైసలు తగ్గింది. తగ్గుదల అనంతరం దేశంలోని ముఖ్య నగరాలలో పెట్రోల్ ధరలు లీటరుకు ఈ విధంగా ఉన్నాయి.. ఢిల్లీ: రూ. 74.33, కోల్‌కతా: రూ.76.96, ముంబయి: రూ.79.93, చెన్నై: రూ.77.21. డీజిల్ ధరలు లీటరుకు.. ఢిల్లీ: రూ. 67.35, కోల్‌కతా: రూ.69.71, ముంబయి: రూ.70.61, చెన్నై: రూ.71.15. సౌదీ చమురు నిల్వలపై దాడుల అనంతరం చమురు ధరలు తారస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే పండగ సీజన్‌లో వీటి ధరలు తగ్గడం వినియోగదారులకు కాస్త ఉపశమనమేనని చెప్పాలి.

# యువతకు తక్షణ ఉపాధి కల్పించేది ఆటో

### పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాసరావు

విశాఖపట్నం,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ):పేద నిరుద్యోగ యువత ఆటో ద్వారానే తక్షణ ఉపాధి పొందుతున్నారని పర్యాటక యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం గురజాడ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన 'వైఎస్ఆర్ వాహన మిత్ర' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే రవాణా సాధనం ఆటో మాత్రమేనని, బడుగు బలహీన వర్గాలకు పిలిచిన వెంటనే పలికే సేవా తత్పరుడు ఆటోడ్రైవర్ మాత్రమేనని చెప్పారు. అటువంటి ఆటోడ్రైవర్ కష్టాలను తన పాదయాత్రలో స్వయంగా తెలుసుకున్న జగన్ మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్ కు రూ.10 వేల ఆర్థిక అందిస్తూ వైయస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంలో రాష్ట్రంలో లక్షా 73 వేల 531 మందికి, జిల్లాలో 24 వేల 512 మందికి లబ్ది చేకూరుతుందన్నారు. వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలలో చేసిన వాగ్దానాలను పత్రికరణ శుద్ధిగా అమలు చేస్తున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని చెప్పారు. పర్యటనలు కాకుండా పనులు చేసి చూపిస్తున్నారన్నారు. గ్రామ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగాల నియామకాల తో యువతకు ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ప్రజల వద్దకు పాలన తీసుకు వచ్చారన్నారు. ఆటో క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సహాయం వారిలో ఆత్మ గౌరవం, భవిష్యత్తుపై భరోసా నింపుతుందన్నారు. ఆటో డ్రైవర్లు పోలీసు, ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ముఖ్యమంత్రికి ప్రజలే పెద్దబాలశిక్ష అయ్యారన్నారు. వృత్తి పనివారలకు, మత్స్యకారులకు, పిల్లలను బడికి పంపే తల్లులకు ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల వారే ఎక్కువగా ఆటో డ్రైవర్లగా పని చేస్తున్నారన్నారు. కుగ్రామాల నుండి మహానగరాల వరకు ఆటోవాలా సేవలు అన్ని రంగాలలో విస్తరించాయని తెలిపారు. వారందరికీ ఆర్థికంగా సహాయపడేందుకు ముఖ్యమంత్రి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. వాహన ఇన్సూరెన్సు సకాలంలో కట్టేందుకు, మరమ్మతులకు ఉపయోగ పడుతుందన్నారు. ఇన్సూరెన్స్ ఉన్నట్లయితే ప్రమాదం సంభవించినప్పుడు ఆటో క్యాబ్ డ్రైవర్లపై ఆర్థిక భారం తప్పుతుందన్నారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో తెలుసుకున్న ఆటో డ్రైవర్ల కష్టాలన అధికారులకు చెప్పి వారికి ఏ విధంగా సహాయం అందించగలరో పరిశీలన చేయమన్నారు. ఆ విధంగా వైయస్సార్ వాహన మిత్ర పథకం రూపొందించారని తెలిపారు. ఈ పథకం జిల్లాలో ఎక్కువ మందికి అందించాలని ప్రయత్నించా మన్నారు. జిల్లాలో రూ 24 కోట్ల 51 లక్షల 20 వేలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ జి సి రాజరత్నం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ డా. జి. సృజన, శాసనసభ్యులు కె భాగ్యలక్ష్మి, ఏ అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, పి ఉమా శంకర్ గణెిష్, ఆర్ డి ఓ పెంచల కిషోర్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు ఆలయ సంప్రదాయాలు పట్టవా?

### - హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాడు
### - రాష్ట్రంలో రావణపాలనకు ఇది నిదర్శనం
### - పోలవరం డ్యాం ఎత్తు తగ్గింపునకు కుట్ర పన్నారు
### - రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతుంటే చూస్తూ ఊరుకోం
### - టీడీపీ నేత, మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు

అమరావతి, అక్టోబర్5(ఆర్ఎన్ఎ) : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలయ సంప్రదాయాలు పట్టడం లేదని, ఆయన హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దైవకార్యాల్లో పురాతనంగా వస్తున్న సంప్రదాయాలను సీఎం జగన్ పట్టించుకోవడం లేదని, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మకు మూలా నక్షత్రం రోజు పట్టువస్త్రాలు ఇవ్వాల్సి ఉందని ఉమా తెలిపారు. దుర్గగుడి సంప్రదాయాలకు విరుద్ధంగా ముందురోజే అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడమేంటని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీ పర్యటన ఉందని సంప్రదాయాలను పక్కనబెట్టి ముందురోజు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడమేంటని ఉమా ప్రశ్నించారు. రాష్ట్రంలో రావణ పాలనకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. జలాశయాల్లో నీరు నిల్వ ఉంచే అవకాశం ఉన్నా అసమర్థతతో సముద్రం పాలు చేస్తున్నారని విమర్శించారు. పోలవరం డ్యాం ఎత్తు తగ్గింపునకు కుట్ర పన్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. పోలవరంలో తక్కువకు టెండర్లు వేస్తేనే బిల్లులు చెల్లిస్తామంటూ బెదిరిస్తున్నారని దేవినేని ఆరోపించారు. పాలనలోనే జగన్ వివక్ష చూపుతున్నారని ఉమా ఆరోపించారు. చంద్రబాబు కార్యాలయంలో పనిచేసిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వడం లేదని, వారిని రిలీవ్ చేయకుండా వివక్ష చూపిస్తున్నారని విమర్శించారు. ఆయన కుల వివక్ష చూసి పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తూ ఓ మహిళా ఎంపీడీవో రోడ్డెక్కి నిరసనకు దిగినా పోలీసులు పట్టించుకోరా అని ఉమా నిలదీశారు.

# ప్రధానిని కెసిఆర్ కలవడంలో తప్పు లేదు: లక్ష్మణ్

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): సీఎం హోదాలో కేసీఆర్ ప్రధానిని కలవటంలో తప్పు లేదని బీజేపీ నేత లక్ష్మణ్ అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్ళకుండా కేసీఆర్ మొహం చాటేశారని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోందని ధ్వజమెత్తారు. ప్రాజక్టుల పేరుతో ఇద్దరు సీఎంలు కమిషన్లు దండుకోవాలనుకుంటున్నారని ఆరోపించారు. జగన్‌తో కేసీఆర్ కొత్త బంధాలు ఏర్పాటు చేసుకున్నారని, నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏపీలో మాదిరి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీ సమస్యలపై కమిటీ వేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఎస్మా, పీడీ యాక్ట్ పేరుతో కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని, ఆర్టీసీని ప్రభుత్వమే నష్టాల ఊబిలోకి నెట్టిందని లక్ష్మణ్ మండిపడ్డారు.

# ప్రధాని మోడీతో సిఎం కెసిఆర్ భేటీ

### పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ

న్యూఢిల్లీ,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): హస్తిన పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్.. ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. సుమారు అరగంటకు పైగా ప్రధానితో సమావేశమై చర్చలు జరిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టు సంబంధించిన అంశంపై ప్రధానితో కేసీఆర్ చర్చించినట్లు సమాచారం. దీనికి కేంద్రం సహకారం అందించాలని కోరినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఏదైనా ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు నిధుల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మోదీని కేసీఆర్ కోరినట్లు సమాచారం. ప్రధానిగా మోదీ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనతో కేసీఆర్ భేటీ కావడం ఇదే తొలిసారి. అంతకుముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో కేసీఆర్ భేటీ అయ్యారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మరికొందరు కేంద్రమంత్రులతోనూ ఆయన సమావేశం కానున్నారు.

# జగన్‌పై చంద్రబాబు సంచలన విమర్శలు

### -తిరుమలపై ఇరకాటంలో పెట్టేలా వ్యాఖ్యలు

అమరావతి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఇటీవల ఏపీ సీఎం జగన్ తిరుమల తిరుపతి దేవస్థానికి పట్టుస్త్రాలు సమర్పించిన వ్యవహారాన్నిరచ్చ చేయడంద్వారా బాబురాజకీయ విమర్శలకు పదను పెట్టడంలో ఆంతర్యం ఏమిటన్నది ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీస్తోంది. గతంలో తిరులమ వ్యవహారంలో తనపైనిందలు మోపిన దరిమిలా ఇప్పుడు అదే అంవంపై జగన్‌ను విమర్శలు చేయాలని చూస్తున్నారు. ఓ క్రిష్టియన్స్వామికి ఎలా పట్టు వస్త్రాలు సమర్పింసతారన్న చర్చ లేవనెత్తారు. ఓ క్రిస్టియన్.. తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలిస్తారా అని ?.. చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతే కాదు తిరుమల ఆలయ కమిటీ వారు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని అని చంద్రబాబు పేర్కొంటున్నారు. తిరుమల ఆలయంలో ప్రవేశానికి అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని చంద్రబాబు అన్నారు. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ సైతం డిక్లరేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. క్రిస్టియన్‌గా చెప్పుకుంటున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి తిరుమల శ్రీవారికి పట్టుస్త్రాలు సమర్పించారని, ఆయనా ఎందుకు డిక్లరేషన్ ఇవ్వలేదని కూడా ఆరోపణలు చేశారు. తిరుమల వేంకటేశ్వం స్వామి కంటే జగన్ అతీతుడా అని కూడా చంద్రబాబు ప్రశ్నించారు. శ్రీవారి పింక్ డైమండ్ తన ఇంట్లో ఉందన్నారని, ప్రత్యేక అధికారి ధర్మారెడ్డి అసలు డైమండ్ అనేదే లేదంటున్నారని,నిజానికి పింక్ డైమండ్ ఎక్కడుందో ప్రభుత్వమే సమాధానం ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్సీపీ సోషల్ మీడియా పోస్టులపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. తనపై, పార్టీ నేతలపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. కేవలం లక్ష రూపాయలు విలువ చేసే అసెంబ్లీ ఫర్నిచర్ కోసం మాజీ స్పీకర్‌కు కోడెల శివప్రసాదరావును క్షోభకు గురిచేశారని, ఆయన ఆత్మహత్యకు కారణం అయ్యారు అని మంది పడ్డారు. వేల కోట్లు దోచుకున్న ఈ సీఎం జగన్‌ని ఏంచేయాలని ఆయన ప్రశ్నించడం కొనసాగిం చాడు. ఇలాంటి పోస్టులు వారి కుటుంబ సభ్యులపై పెడితే ఊరుకుంటారా? అసలు వారిని వదిలిపె డతారా? అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు సాధారణ పోస్టులు పెట్టినా అరెస్టులు చేసి జైళ్లకు పంపిస్తున్నారని చంద్ర బాబు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు కేసులతో ఇబ్బందులకు గురైన టీడీపీ సానుభూతిపరులతో ప్రత్యక్షంగా మాట్లాడించారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలు టీడీపీపై పెట్టిన ప్రతి పోస్టును డీజీపీకి ఇచ్చామని, అయినా చర్యలు తీసుకో లేదన్నారు. తెలుగుదేశం ఫిర్యాదులు డీజీపీకి ఎందుకు కనిపించడంలేదని చంద్రబాబు ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరినీ వదిలిపెట్టమంటూ హెచ్చరికలు చేశారు. ఒక మాజీ డీజీపీపై అసభ్య పోస్టు పెడితే ప్రస్తుత డీజీపీకి, పోలీసులకు రోషం లేదా? అని చంద్రబాబు నిలదీశారు. మొత్తంగా ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు జగన్‌ను ఇరకాటంలో పెట్టడానికే అని అంటున్నారు.

# అనుచిత పోస్టింగ్‌లు సరికాదు

### బాబు రాజకీయంపై మండిపడ్డ బొత్స

అమరావతి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి అనుచిత పోస్టింగులైనా సరికాదని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆ చర్యల్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. ఆయా పోస్టింగులపై తెదేపా అధినేత చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించడం దారుణమని విమర్శించారు. సీనియర్ నేతనంటూ పేర్కొనే ఆయన.. ఏం ఆశించి ఇలా వ్యవహరించారని బొత్స ప్రశ్నించారు. అమరావతిలో మీడియాతో బొత్స మాట్లాడారు. ప్రతి అంశాన్నీ రాజకీయ లబ్ధికోసం వాడుకోవాలనుకోవడం దురదృష్టకరమని చంద్రబాబును ఉద్దేశించి బొత్స వ్యాఖ్యానించారు. పదవికి దూరమయ్యాననే అసహనం ప్రతిపక్ష నేతలో అణువణువునా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. నాలుగు నెలల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సీఎం జగన్ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. నిర్మాణాత్మక సూచనలు, సలహాలతో సహకరించాల్సింది పోయి.. విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని చంద్రబాబుపై మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులపై సమగ్ర విచారణ, పరిశీలన జరగాల్సిన అవసరముందని బొత్స అభిప్రాయపడ్డారు.

# మంత్రి ఇంటిముందు యువతి ఆత్మహత్యాయత్నం

అమరావతి,అక్టోబర్5(ఆర్ఎన్ఎ):ఏపి మంత్రి పినిపె విశ్వరూప్ ఇంటి ముందు యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంలో న్యాయం చేయాలంటూ మంత్రికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్న మనస్తాపంతో ఆ యువతి ఆత్మహత్యాయత్నం చేసిందని అంటున్నారు. తన ఆవేదన చెప్పుకునేందుకన్నట్లు వచ్చిన యువతి హఠాత్తుగా పురుగుల మందు తాగడంతో అక్కడి వారు షాకయ్యారు. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ తన బాధను చెప్పుకోవడానికి ఓ యువతి పలుమార్లు మంత్రి నివాసానికి వచ్చింది. శుక్రవారం మరోసారి మంత్రి నివాసానికి వెళ్లిన బాధితురాలు అక్కడున్న వార్కి తన గోడు వెళ్లబోసుకుంది. ఈ క్రమంలో అనూహ్యంగా పురుగుల మందు తాగింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని సమాచారం. యువతి ఆత్మహత్యాయత్నం చేసిన సమయంలో మంత్రి ఇంట్లో లేరని తెలుస్తోంది.

# కాంగ్రెస్‌పై విమర్శలతో ప్రజలను మభ్యపెట్టలేరు

**ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం ఇచ్చుకోవాల్సిందే**
**మాజీమంత్రి శ్రీధర్ బాబు**

కరీంనగర్,అక్టోబర్5 (ఆంఎన్ఎ): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్‌పై నిందలు మోపిన కెసిఆర్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టీసీ సమ్మెను నివారించడంలో ప్రభుత్వంపూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆర్టీసీని కాపాడడంలో ఐదేళ్లుగా ఎందుకు దృష్టి పెట్టలేదన్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా పాలించడం చేతకాక ఆర్టీసిని నిండా ముంచే పని చేశారని అన్నారు. మాటతప్పిన ప్రభుత్వానికి బుద్ది చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని, టీఆర్ఎస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని శనివారం నాడిక్కడ అన్నారు. దమ్ము ధైర్యం ఉంటే గత ఐదేళ్లలో ఏం చేశారో చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. ఇన్నాళ్లు ప్రజలను మాటలతో మభ్యపెట్టిన ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. కాంగ్రెస్‌ను విమర్శిస్తే ప్రజలు నమ్మరని ఆ కాలం పోయిందన్నారు. ప్రజలు ఎవరేంటన్నది బాగా తెలుసుకున్నారని అన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాలో శాతవాహన యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాల, జేఎన్‌టీయూ రెండు కళాశాలలు, 50 మోడల్ స్కూళ్లు, పాస్‌పోర్టు కేంద్రం, కేజీబీవీ పాఠశాలలు ఏర్పాటు చేశామని అన్నారు. అయితే టిఆర్ఎస్ హయాంలో ఈ నాలుగేళ్లలో శాతవాహన యూనివర్సిటీకి వీసీని నియమించలేని దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, అప్పర్‌మానేరు, వరదకాలువ ప్రాజెక్టుల పనులు పూర్తి దశకు చేరుకున్నాయని, ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేసిన పాపాన టీఆర్ఎస్ లేదని అన్నారు. ఇవన్నీ గమనించి ప్రజలు తగినసమయం కోసం చూస్తున్నారని అన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన పోరాటమేమిటో, ఏ జైళ్లో ఉన్నాడో, ఎన్ని కేసులు నమోదయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను దగా చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించాడని, అసెంబ్లీ సాక్షిగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మరిచారా అని దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం అంటూ ఊదరగొట్టి ఇప్పుడు అలా తాను అనలేదని అనడం ఆయనకే చెల్లిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు హామీలుగానే మారాయని, మిషన్ భగీరథ కాసుల కక్కుర్తికే పెట్టారని, ఎస్సీ, ఎస్టీల 12 శాతం రిజర్వేషన్ అటకెక్కిందని అన్నారు. హామీలను మరచి కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# అభివృద్ధి పథకాలతో విపక్షాల బేజార్ : ఎమ్మెల్యే

మెదక్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దోపిడీకి గురైన అన్ని కులవృత్తులను ఆదుకొని వారి భవిష్యత్తుకు అన్నివిధాలా ప్రభుత్వమే భరోసా కల్పించే దిశగా సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని అన్నారు. వికలాంగులకు రూ.1500లు, వృద్ధులు, వితంతువులకు రూ.1000 పింఛను అందజేస్తున్న ఘనత సీఎం కెసిఆర్‌దని అన్నారు. రైతులకు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ అందిస్తున్న ఘనత కూడా కెసిఆర్‌దని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం వారికి ఉచితంగా చేప విత్తనాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా ఉచితంగా పంపిణీ జరగలేదన్నారు. మత్స్యకార కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, నదులు ఇలా అన్ని రకాల నీటి వనరుల్లో చేపలను వదులుతున్నట్లు చెప్పారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు మత్స్యకారులను దోపిడీకి గురిచేస్తూ, దళారులకు కొమ్ముకాశాయని విమర్శించారు. స్వరాష్ట్రంలో మత్స్యకారులకు ఆ పరిస్థితి లేకుండా వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో అన్ని నీటి వనరులు కళకళలాడుతున్నాయని అన్నారు. చేప పిల్లల పంపిణీతో సరిపెట్టకుండా వారికి మార్కెట్ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రతి చోట మత్స్యకారులకు సంఘ భవనాలు మంజూరు చేస్తామన్నారు. తమ సొసైటీలను బలపర్చుకునే దిశగా ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ప్రతి చేప పిల్ల పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటూ మీ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి దేశ విదేశాలకు చేపలు ఎగుమతి చేసే విధంగా మత్స్యకారులు తమ వృత్తిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రతి మత్స్యకారుడు కూలీగా కాకుండా యజమానులుగా మారాలన్నారు.

# సరస్వతీదేవీగా కనకదుర్గమ్మ

**దుర్గగుడికి పోటెత్తిన భక్తజనం**
**భవానీ నామస్మరణతో మార్మోగిన ఇంద్రకీలాద్రి**
**దుర్గాదేవిని దర్శించుకున్న రోజా, పలువురు ప్రముఖులు**

విజయవాడ,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా..ఇంద్రకీలాద్రిపై కొలువైన ముగ్గురమ్మలగన్న మూలపుటమ్మ కనకదుర్గమ్మ అమ్మవారు ఏడవ రోజు శనివారం సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. జగన్మాత దుర్గమ్మ జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో దుర్గగుడికి పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులంతా జై..భవానీ... జైజై జగజ్జననీ నామస్మరణ చేసుకుంటు అమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి అంతా అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగింది. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం కావటంతో దుర్గమ్మను సరస్వతి దేవి అలంకారంలో దర్శించుకునేందుకు క్యూ లైన్లలో వేచి ఉన్న వేలాదిమంది భక్తులు కెనాల్ రోడ్డులోని వినాయకుడు గుడి వద్ద నుంచి ఇంద్రకీలాద్రిపై రాజగోపురం వరకు ఉన్న క్యూ మార్గంలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా 7వ రోజైన శనివారం (ఆశ్వయుజ శుద్ధ సప్తమి) నాడుసరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ బంగారు వీణతో భక్తులకు చదువుల తల్లి సాక్షాత్కారించింది. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రానికి శరన్నవరాత్రుల్లో ఎంతో విశిష్టత ఉంది. అందుకే ఆశ్వయుజ శుద్ధ సప్తమి నాడు చదువుల తల్లిగా కొలువుదీరే దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు ఎంతో ఆసక్తి చూపారు. త్రిశక్తి స్వరూపిణి నిజస్వరూపాన్ని సాక్షాత్కారింపజేస్తూ శ్వేత పద్మాన్ని అధిష్ఠించిన దుర్గామాతా తెలుపు రంగు చీరలో బంగారు వీణ, దండ, కమండలం ధరించి అభయముద్రతో సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించింది. అమ్మవారికి గారెలు, పూర్ణాలను నైవేద్యంగా సమర్పించారు.

దుర్గమ్మను దర్శించుకున్న రోజా..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెజవాడ కనకదుర్గమ్మ సరస్వతీ అలంకారంలో దర్శనమిస్తున్నారు. శనివారం దుర్గమ్మను ఏపీఐఐసీ చైర్మన్ రోజా దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతేడాది ఇదే రోజు అమ్మను దర్శించుకుని జగన్‌ను సీఎం చేయాలని కోరుకున్నానని తెలిపారు. నేడు జగన్‌ను ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరుకున్నట్టు పేర్కొన్నారు. ప్రశాంతంగా ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుంటున్నారని రోజా పేర్కినంనారు. రోజాతో పాటు పలువురు ప్రముఖులు సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా పోటెత్తడంతో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.





# మేధావులను నిర్లక్ష్యం చేసింది నిజంకాదా?

**బిజెపి నేత విమర్శలు**

ఆదిలాబాద్,అక్టోబర్5 (ఆంఎన్ఎ): తెలంగాణ ఉద్యమంలో చేయూతనిచ్చి, ముందుకురికిన మేధావులు కేసీఆర్ పాలనను ఛీకొడుతున్నారని బిజెపి అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. మేధావులను ఏనాడు పట్టించుకోకుండా, వారి ఆలోచనలను పంచుకోకుండా చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. ప్రజల ఎజెండానే మహాకూటమి ఎజెండా అని ఆయన తెలిపారు. ప్రజల ఆకాంక్షలైన నిధులు, నీళ్లు, ఉద్యోగాలే తమ ఎజెండా అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నీరుగార్చిన టిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. ప్రజలను నిజాం నిరంకుశ పాలనలోకి తీసుకుని వెళ్లిన ఘనత కెసిఆర్‌దని అన్నారు.

అందుబాటులో ప్రభుత్వం, ప్రజల మధ్య ప్రభుత్వం అనే నినాదంతో రానున్న ఎన్నికల్లో ప్రచారం చేయబోతున్నామన్నారు. నియంతృత్వం కావాలో, ప్రజాస్వామ్యం కావాలో ప్రజలను తేల్చుకుంటారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చ చేస్తే ఏమేర అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. ఉపక్షాలపై విరుచుకు పడడం మినహా చేసిందేవి లేదన్నారు. విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, పోరాట యోధులంతా మహాకూటమికి మద్దతు తెలుపుతున్నారన్నారు

## కాంగ్రెస్ గెలిస్తేనే..
# ప్రజాస్వామ్యం నిలడుతుంది

- ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్రచేస్తున్నారు
- కేటీఆర్ ఏమోహం పెట్టుకొని ఓట్లడుగుతున్నారు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్

సూర్యాపేట, అక్టోబర్5 (ఆర్ఎన్ఎ) : హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తేనే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన శనివారం హుజూర్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందని, టీఆర్ఎస్ వస్తే.. అప్పులు రెట్టింపు అవుతాయని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే.. కేటీఆర్ ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ హంగు, ఆర్భాటాలే తప్ప.. ఎక్కడా అభివృద్ధి జరుగలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడ వల్లనే ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగారని పొన్నం విమర్శించారు. కేసీఆర్ కావాలనే టీఎస్‌ఆర్టీసీని నిర్వీర్యం చేసి, భారీ నష్టాల్లో కూరుకుపోయిందని లెక్కలు చూపి సంస్థను ప్రైవేట్ పరం చేయాలనీ చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా చేయాలనీ కేసీఆర్ చూస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో మాదిరిగానే.. తెలంగాణలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

# నిజామాబాద్‌లో రావణ దహనం

**-జాగృతి ఆధ్వర్యంలో దసరా నాడు కార్యక్రమం**

నిజామాబాద్,అక్టోబర్5(ఆర్ఎన్ఎ): ఈ నెల 8వ తేదీ విజయదశమిని పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం జరగనుంది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాలనుసారం రావణ దహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి మిడియాకు తెలిపారు. జాగృతి ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాల నుండి నిజామాబాద్ నగరంలో రావణ దహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రావణుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడుకు చెందిన దాదాపు 35 అడుగుల ప్రతిమలను ఏర్పాటు చేసి వాటి దహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ హాజరవుతారని తెలిపారు, ఈ కార్యక్రవానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గత 7 సంవత్సరాలుగా రావణ దహన కార్యక్రమం ఏర్పాటు చేయడానికి సహకరిస్తున్న మార్వాడి కుల పెద్దలు జుగల్ కిషోర్ పాండే, కమల్ ఇనానీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి కుమార్ పాటు రాష్ట్ర కార్యదర్శి నరాల సుధాకర్, జుగల్ కిషోర్ పాండే, కమల్ ఇనాని, అపర్ణ, రాజేంద్ర ప్రసాద్, రాజేష్, మురళీ, రమేష్ రావు, హరీష్, గోపాల్, దండు శ్రీకాంత్, విక్కీ తదితరులు పాల్గొన్నారు

# నకిరేకల్ ఆస్పత్రిని విస్తరించాలి

**ప్రమాద బాధితులకు ఇదే వరం**

నల్గొండ,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): నిత్యం రోడ్డు ప్రమాద బాధితులు.. మూడు నియోజకవర్గాలకు చెందిన గ్రామాల నుంచి రోగుల తాకిడి ఉన్నా నకిరేకల్ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జాతీయ రహదారిపై జిల్లాతోపాటు నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వెళుతుంటారు. హైవేపై ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లు అధికం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురైన వారిని మొదటగా నకిరేకల్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొస్తుంటారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సత్వర వైద్యం అందిస్తే 30 శాతం మంది ప్రాణాలు కాపాడేందుకు వీలుంటుంది. అయితే ఇక్కడ ట్రామా కేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చాలా ఏళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకపోతే నకిరేకల్ వైద్యశాలలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నా నేటికి ఆ సేవలు అందుబాటులోకి రాలేదు. పేరుకే 30 పడకల వైద్యశాల ఉన్నపటికి మూడు నియోజకవర్గాలకు చెందిన నాలుగైదు మండలాల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు.

వైద్యశాలకు 250 నుంచి 300 మందివరకు బయటి రోగులు చికిత్సల కోసం వస్తుంటారు. అత్యవసర వైద్యం కోసం ఒకే రోగులు అధిక సంఖ్యలో వస్తే ఇక్కడ సదుపాయాలు సరిపడా అందడం లేదు. అయితే ఈ వైద్యశాలను విస్తరించే అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని ప్రధాన వైద్యాధికారి అన్నారు.

# తెరాస సోమరితనానికి గిన్నిస్ ఖాయం

**టీఆర్టీ అభ్యర్థుల సమస్యలుపరిష్కరించాలి**
**సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన ఎంపి రేవంత్**

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): టీఆర్టీ ఫలితాలు వెల్లడించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని.. ఈ విషయం తనను విస్మయానికి గురిచేసిందని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. అర్హత సాధించిన టీఆర్టీ అభ్యర్థులు తమకు వెంటనే పోస్టులు కేటాయించాలంటూ శుక్రవారం ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఎంపీ రేవంత్ రెడ్డి అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. దీనిపై స్పందించి సీఎం కేసీఆర్‌కు ఓ బహిరంగ లేఖ రాశారు. టీఆర్టీ ఉద్యోగాల భర్తీ కోసం 2017లో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో తామంతా ఉత్తీర్ణత సాధించామని.. ఇప్పటికీ నియామక ఉత్తర్వులు అందలేదని అభ్యర్థులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు లేఖలో వివరించారు. నియామక ఉత్తర్వులు ఎప్పుడు ఇస్తారో.. అసలు ఇస్తారో లేదో తెలియక అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని రేవంత్ లేఖలో పేర్కొన్నారు. యువత పట్ల ప్రభుత్వానికి ఏమేరకు శ్రద్ధ ఉందనే విషయం దీనిద్వారా తెలుస్తోందన్నారు. తెరాస ప్రభుత్వ సోమరితనానికి కచ్చితంగా గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కుతుందని రేవంత్ ఎద్దేవా చేశారు. తెలంగాణ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఉండాల్సిన స్థాయిలో లేవన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇండెక్స్ పేరుతో ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంటే.. తెలంగాణ 14వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. 'మీ కుటుంబ సౌఖ్యం గురించి ఆలోచనే తప్ప టీఆర్టీ అభ్యర్థుల కుటుంబ సభ్యుల ఆవేదన మీకు పట్టదా? ఇది మీకు సిగ్గుచేటు అనిపించడం లేదా?'అంటూ సీఎం కేసీఆర్‌ను రేవంత్ ప్రశ్నించారు. ఢిల్లీ పర్యటనలు, ఉప ఎన్నికలపై చూపిస్తోన్న శ్రద్ధ ఉద్యోగ నియామకాలపై పెట్టాలని రేవంత్ డిమాండ్ చేశారు.

# జంటనగరాల్లో దేవాదాయ భూములకు రక్షణ

**త్వరలోనే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**
**నగర ప్రతినిధులతో చర్చించిన మంత్రి తలసాని**

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): జంటనగరాల్లో అన్యాక్రాంతమవుతున్న దేవాలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. వివిధ దేవాలయాలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములు అక్రమణకు గురవుతున్నాయని అన్నారు. వాటి పరిరక్షణకు జీహెచ్ఎంసి తరహాలో దేవాదాయశాఖలో కూడా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలతో చర్చిస్తామన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, నగరానికి చెందిన ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీలు ప్రభాకర్, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ తదితరులతో మంత్రి తలసాని జంటనగరాల్లోని దేవాలయ భూముల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేవాలయాలకు సంబంధించి కమిటీల నియామకం, భూములకు సంబంధించి పలు కేసులు సంవత్సరాల తరబడి కోర్టులలో కొనసాగుతున్నాయని, అలాంటి వాటి పరిష్కారానికి దేవాదాయశాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని దేవాలయాలపై కొందరు వ్యక్తులు తమ ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించబోమన్నారు. త్వరలోనే జంటనగరాల పరిధిలో ఉన్న వివిధ కేటగిరీలకు చెందిన సువారు 200 ఆలయాలకు కమిటీలను నియమించనున్నట్టు మంత్రి తలసాని తెలిపారు. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకు సంబంధించిన జాబితాను ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు అందజేశారు. జీహెచ్ఎంసి, రెవెన్యూ, వాటర్‌వర్క్స్ తదితర శాఖలకు చెందిన సమస్యలపై కూడా ఈసందర్భంగా చర్చించారు. ప్రతి నెలా రెండు నియోజకవర్గాల్లో వివిధ శాఖల అధికారులతో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు మంత్రి తలసాని ఈసందర్భంగా తెలిపారు.

# పీవీపీ ఇంటిపై బండ్ల గణేష్ దాడి

**- కేసు నమోదు చేసిన పోలీసులు**

హైదరాబాద్,అక్టోబర్5 (ఆర్ఎన్ఎ): సినీ నిర్మాత బండ్ల గణేష్ వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై జూబ్లీహిల్స్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రముఖ నిర్మాత, వైసీపీ నేత పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. బండ్ల గణేష్ తనను బెదిరించారని నిర్మాత పీవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్థరాత్రి జూబ్లీహిల్స్ లోని తన ఇంటికి వచ్చిన బండ్ల గణేష్ హల్‌చల్ చేశాడని పీవీపీ చెప్పారు. అనుచరులతో వచ్చిన బండ్ల.. తనను బెదిరించాడని ఫిర్యాదు చేశారు. టెంపర్ సినిమాకు గణేష్‌కు ఫైనాన్స్‌గా పీవీపీ రూ.7 కోట్లు ఇచ్చారు. కొంతకాలంగా తన డబ్బు తిరిగివ్వాలని బండ్ల గణేష్‌ను.. పీవీపీ అడుగుతున్నారు. అయినా గణేష్ పట్టించుకోకపోవటంతో శుక్రవారం రాత్రి బండ్ల గణేష్‌కు మరోసారి ఫోన్ చేసి పీవీపీ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని కోరారు. కోపంతో ఊగిపోయిన బండ్ల గణేష్.. రాత్రి తన ఇంటిపై దాడి చేశాడని, అనుచరులతో కలిసి వచ్చి తననను బెదిరించాడని పీవీపీ ఆరోపించారు. ఈ మేరకు పీవీపీ జూబ్లిహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు బండ్ల గణేష్ సహా మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు. 420, 448, 506 రెడ్ విత్, 34 సెక్షన్ల కింద పోలీసులు బండ్ల గణేష్‌తో పాటు అతడి అనుచరుల పై కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. తనకు రావాల్సిన బకాయిలు అడినందుకు బండ్ల గణేష్ తన అనుచరులతో కలిసొచ్చి దౌర్జన్యం చేశారని, బెదిరించారని పీవీపీ వాపోయారు. టెంపర్ సినిమాకు సినీ ఫైనాన్షియర్, సహ నిర్మాత పీవీపీ.. బండ్ల గణేష్ కు రూ.30కోట్లు పెట్టుబడి పెట్టారు. సినిమా విడుదల సమయంలో అసలు మొత్తాన్ని చెల్లించి ఇంకొంత మొత్తానికిగానూ చెక్కులను గణేష్ ఇచ్చాడు. మిగిలిన డబ్బు చెల్లించాలని బండ్ల గణేష్ ని కొంతకాలంగా పీవీపీ కోరుతున్నారు. దీంతో గణేష్ మనుషులు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని పీవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం బండ్ల గణేష్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

సినిమా

# ఎంపీ సంతోష్ కుమార్ ఛాలెంజ్ స్వీకరించిన వరుణ్ తేజ్..



హైదరాబాద్: రాజ్యసభ సభ్యుడు జె. సంతోష్ కుమార్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌ను సినీ నటుడు వరుణ్ తేజ్ స్వీకరించాడు. ఈ సందర్భంగా వరుణ్ తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటాడు. మొక్కలు నాటిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ సందర్భంగా వరుణ్ ట్విట్టర్ వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గ్రీన్ ఛాలెంజ్‌కు నన్ను నామినేట్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్ గారికి, అక్కినేని అఖిల్‌కు ధన్యవాదాలు. షూటింగ్ విషయంలో బిజీగా ఉన్నప్పటికీ, ఇలాంటి ముఖ్యమైన పనులకు సమయం కేటాయించడం సంతోషకరమైన విషయం. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా నేను నటీమణులు సాయి పల్లవి, తమన్నాలకు నామినేట్ చేస్తున్నానని ఈ మెగా ప్రిన్స్ ట్విట్టర్ ద్వారా తెలిజేశారు.

ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఛాలెంజ్ వివరాలు

భారతదేశం మొక్కలతో పచ్చగా కళకళలాడాలనే ఉద్దేశ్యంతో మూడు కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తదనంతరం ఈ సంఖ్య 10 కోట్లకు విస్తరింపజేయాలనేది ఆయన లక్ష్యం. ఇందులో భాగంగా గ్రీన్ ఛాలెంజ్ తీసుకువచ్చారు. మొక్కలు నాటిన ఒక వ్యక్తి మరో ముగ్గురు వ్యక్తులతో మొక్కలు నాటించాలనీ, వారు మరో ముగ్గురు వ్యక్తులను నామినేట్ చేసి మొక్కలు నాటించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీ విసిరిన ఈ ఛాలెంజ్‌ను రాజకీయ నాయకులు, సెలెబ్రిటీలు, కేంద్ర మంత్రులు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఎవరైతే నాటిన మొక్కలను ఎక్కువగా సంరక్షిస్తారో వారికి మాజీ రాష్ట్రపతి 'డా. ఏపీజే అబ్దుల్ కలాం వనమిత్ర' అవార్డుతో సత్కరిస్తామని ఎంపీ తెలిపిన విషయం తెలిసిందే.

# మంచి పని కోసం తన పెయింటింగ్ వేలం వేస్తున్న సన్నీ



బాలీవుడ్ బ్యూటీ సన్నీలియోన్ మంచి పని కోసం ముందుకు వచ్చారు. కుంచె చేత పట్టుకొని పెయింటింగ్ వేసి ఆ పెయింటింగ్‌ని వేలం వేయమని ఇచ్చారు.

ఆ వచ్చిన మొత్తాన్ని క్యాన్సర్ రోగుల చికిత్స కోసం ఉపయోగించనుంది. సన్నీ లియోన్ తండ్రి క్యాన్సర్ వ్యాధితో మరణించిన కారణంగా ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. ఒక్కరిలోనైనా అవగాహన తీసుకురాగలిగినా, ఒక్కరి చికిత్సకు అవసరమైన డబ్బులు సమకూర్చగలిగినా... క్యాన్సర్‌పై యుద్ధంలో చిన్న విజయం సాధించినట్టే అని అంటుంది సన్నీ. కుంచె చేత పట్టుకొని ప్రతి గీత గీస్తున్నప్పుడు నాన్న ఆలోచనలే.

ఆయని ఎంతగానో మిస్ అవుతున్నాను. నిధుల కోసం కాదు. క్యాన్సర్‌పై యుద్ధం చేస్తున్న వారిలో ధైర్యాన్ని నింపేందుకు నా జీవితంలో జరిగిన విషయాలని స్టోరీలుగా చెప్పబోతున్నాను అని సన్నీ అంటోంది.

# చెట్ల నరికివేతను సమర్థించిన కేంద్ర మంత్రి




హైదరాబాద్, అక్టోబర్ 5: ముంబైలోని ఆరే కాలనీలో చెట్లను నరికివేస్తున్నారు. మెట్రో కారు పార్కింగ్ కోసం అధికారులు కొన్ని వేల వృక్షాలను తొలగించేందుకు ప్రక్రియ మొదలుపెట్టారు. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతున్నది. అయితే కేంద్ర మంత్రి జవదేకర్ మాత్రం చెట్ల నరికివేతను సమర్థించారు. అభివృద్ధి, పర్యావరణ సమతులత్య ఒకే రీతిలో సాగాలన్నారు. ఢిల్లీలో తొలిసారి మెట్రో స్టేషన్ కోసం 25 చెట్లను నరికేశారని, అప్పుడు కూడా నిరసనలు వెల్లువెత్తాయని, కానీ ఇప్పుడు అక్కడ అటవీ శాతం పెరిగిందన్నారు. లక్నోలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ఆరే కాలనీలో సుమారు 2500 చెట్లను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని బీజేపీ మిత్రపక్షం శివసేన తప్పుపట్టింది. మరో వైపు ఇవాళ ఆరే కాలనీలో 144 సెక్షన్ విధించారు. కొందరు కార్యకర్తలను అరెస్టు చేశారు. ప్రస్తుతం ముంబైలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నది. ఆరే అటవీ ప్రాంతం కాదని బాంబే హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిందన్నారు.

# ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం..

హైదరాబాద్, అక్టోబర్ 65: ఇవాళ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. 1996 నుంచి యునెస్కో అధికారికంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.. ఈ సందర్భంగా యూనెస్కో ప్రతినిధి మాట్లాడుతూ.. ప్రపంచానికి స్ఫూర్తినిచ్చేది టీచరే. చిన్నారి విద్యార్థులను భావితరాలకు భాద్యతాయుతమైన పౌరులుగా, ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు. జీవితంలో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుల పాత్ర కీలకం. యునెస్కో.. యూనిసెఫ్, ఎన్‌డీపీ, ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ భాగస్వామ్యంతో టీచర్స్‌డేను అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం టీచర్స్‌డే నినాదం.. యంగ్ టీచర్స్: ది ఫ్యూచర్ ఆఫ్ ది ప్రొఫెషన్. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉపాధ్యాయులు చేసేందుకు ప్రోత్సహించాలి. ఉపాధ్యాయునికి గల ప్రాముఖ్యతను, వారి సేవలను చిన్నారులకు తెలియజేయాలి.

ప్రస్తుతం విద్య సాంకేతికంగా కొత్త పుంతలు తొక్కుతోందనీ, ఉపాధ్యాయులు.. ప్రభుత్వ విద్యా సంస్థలు ప్రైవేటు విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులకు అన్ని రకాల మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాలని తెలిపింది. కాగా, భారత్‌లో సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

## హనుమద్వాహనంలో ఊరేగిన శ్రీవారు

తిరుమల,అక్టోబర్5(ఆర్‌ఎన్‌ఎ): కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఆరో రోజున దేవదేవుడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. హనుమంతుడు భగవత్ భక్తుల్లో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడిగా, వ్యాకరణ పండితుడిగా.. లంకా భీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు.. తిరుమలేశుని తన మూపున వహించి తిరువీధుల్లో దర్శనమిచ్చే ఘట్టం భక్తజన రంజితం. హనుమంతుడ్ని స్మరిస్తే.. బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం లభిస్తాయని పురాణ వచనం. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# ఆర్టీసీతో పెట్టుకుంటే మసైపోతారు

- ఉద్యమ సమయంలో హామీలను నెరవేర్చాలి
- కాళేశ్వరం నుంచి చుక్కనీరు కూడా ఎల్లపల్లికి ఎత్తిపోయలేదు
- ప్రాజెక్టుల అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 5(ఆంఎన్‌ఎ) : ఉద్యమ సమయంలో ఆర్టీసీకి ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నెరవేర్చాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడారు.. ఆర్టీసీ కార్మికులతో పెట్టుకుంటే మసైపోతారని హెచ్చరించారు. సమైక్య పాలకులను హెచ్చరించిన కేసీఆర్ ఇప్పుడు ఆయన మసికాక తప్పదన్నారు. పక్క రాష్ట్రంలో ఆర్టీసీ బలోపేతం కోసం ప్రభుత్వంలో వీలీనం చేశారని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా కార్మికులను సమ్మె వైపు పురికొల్పిందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించి నాలుగు నెలలు అవుతుందని, ఒక్క చుక్క నీరుకూడా ఎల్లంపల్లికి ఎత్తిపోయలేదని జీవన్‌రెడ్డి విమర్శించారు. కడెం ప్రాజెక్టు ద్వారా వచ్చిన నీరు మాత్రమే ఎల్లంపల్లికి చేరిందని, ప్రాజెక్టు ప్రచారంలో ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి, నిర్మాణంలో లేదని విమర్శించారు. మిడ్ మానేరులో నీటి నిల్వచేసే పరిస్థితి లేకపోవడంతో ప్రాజెక్టు ఫలాలు అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాజెక్టు రిపోర్ట్ ను నివేదించకపోవడం వల్ల జాతీయ ప్రాజెక్టుగా గుర్తించబడలేదని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానికి ఇచ్చిన 23విజ్ఞప్తిలలో రాష్ట్రంలో ఒక ప్రాజెక్టు జాతీయ హోదా కల్పించమని కోరారా అంటూ కేసీఆర్‌ను ప్రశ్నించారు. కాళేశ్వరంకు జాతీయ హోదా అడగలేదని, రోజుకు రెండు టీఎంసీల నీరుఎత్తిపోసే ఆ నీరు మనకు సరిపోతుందని కానీ రెండు టీఎంసీలకు అదనంగా మరో టీఎంసీ ఎత్తి పోసే విధంగా రీ డిజైన్ చేశారని అన్నారు.

# చెట్ల నరికివేత అక్రమం కాదు..

- ఈ మేరకు బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చింది
- కొందరు తమనుతాము ఉన్నతమైన న్యాయవ్యవస్థగా భావించటం సరికాదు
- పర్యావరణ కార్యకర్తలపై మంబయి మెట్రో చీఫ్ ఆగ్రహం

ముంబయి, అక్టోబర్ 5 (ఆర్‌ఎన్‌ఎ) : ముంబైలోని ఆరే కాలనీలోని దాదాపు 3వేల చెట్లను నరికేయడం అక్రమం కాదని ముంబై మెట్రో చీఫ్ అశ్వినీ భిడే తెలిపారు. చెట్లను నరికివేసేందుకు అనుమతి ఇవ్వడం, నరికివేసే సమయం మధ్య 15రోజుల తప్పనిసరి నోటీసు వ్యవధి లేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె వరుస ట్వీట్ లు చేశారు. ట్రీ అథారిటీ ఆర్డర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ అయిన తర్వాత 15రోజుల నోటీసు అవసరమని తప్పుడు ప్రచారం జరుగుతందని, ఇది ఖచ్చితంగా నిరాధారమైనదని ఆమె ఓ ట్వీట్ లో తెలిపారు. ట్రీ అథారిటీ ఉత్తర్వు సెప్టెంబర్ 13న జారీ చేయబడిందని, సెప్టెంబర్ 28 నాటికే 15 రోజులు గడిచిపోయినప్పటికీ గౌరవ హైకోర్టు తీర్పు వెలువడే వరకు చర్యలు కోసం ఎదురుచూసినట్లు ఆమె తెలిపారు. అరే కాలనీలో మెట్రో కార్ల షెడ్ కోసం చెట్ల నరికివేతను సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను శుక్రవారం బాంబే హైకోర్టు అన్ని స్పష్టమైన నిబంధనలతో తోసిపుచ్చిందని, కానీ కొంతమంది ప్రజలు తమను తాము ఉన్నతమైన న్యాయవ్యవస్థగా భావిస్తారని ఆమె తెలిపారు. వారి స్వంత చర్యలు చట్టవిరుద్ధమని ఆమె తెలిపారు. కోర్టులో జరిగిన యుద్ధంలో ఓడిపోతే, దానిని వీధికి తీసుకెళ్లడం కంటే గౌరవంగా అంగీకరించడం మంచిదని చెట్ల నరికివేతను అడ్డుకుంటున్నవారిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అరే కాలనీలో కార్ల షెడ్డును నిర్మించాలని ముంబై మెట్రో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణ కార్యకర్తలు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు చెట్ల నరికివేత అడ్డుకోవాలంటూ హైకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం పిటిషన్లను విచారించిన హైకోర్టు వాటిని కొట్టివేసింది. దీంతో శుక్రవారం రాత్రి కొన్ని చెట్లను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పర్యావరణ కార్యకర్తలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బుల్డోజర్లకు అడ్డుగా నిలబడి శాంతియుతంగా నిరసన చేపట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టి అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ కార్పోరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబై నిబంధనల ప్రకారం కోర్టు ఆర్డర్ వెబ్‌సైట్‌లో పెట్టిన 15రోజుల తర్వాతే చెట్లు నరికివేసే వీలుంటుందని పర్యావరణ కార్యకర్తలు చెబుతున్నారు. కానీ మెట్రో అధికారులు మాత్రం అర్ధరాత్రి అత్యుత్సాహం ప్రదర్శించి చెట్లను నరికివేయడం దారుణమన్నారు. అయితేచెట్లను నరికివేయడాన్ని రాజకీయనాయకులు, బాలీవుడ్ ప్రముఖులు,సెలబ్రిటీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శనివారం ముంబైలోని ఆరే కాలనీలో 144 సెక్షన్ విధించారు.

# సింజెంటా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆంధ్రప్రదేశ్లో తొలి ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటు




విజయవాడ, అక్టోబర్, 5: స్నేహ పూర్వక రాష్ట్రానికి మారుపేరుగా నిలిచిన ఆంధ్రప్రదేశ్లో అగ్రశ్రేణి వ్యవసాయ సంస్థ 'సింజెంటా' అంతర్జాతీయ ప్రమాణాలతో ఏలూరులోని భీమడోలులో తొలి ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని సింజెంటా సీఈఓ ఎరిక్ ఫ్యార్వాల్డ్ మంగళవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తున్న ఎరిక్ ఫ్యార్వాల్డ్ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బహుళార్ధక సాధక ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ప్రారంభించారు. బహుళార్ధక సాధక కేంద్రంగా ఇది నూతన ఉత్పత్తులను పరీక్షించేందుకు, ప్రొఫైలింగ్, నూతన ఉత్పత్తుల అభివృద్ధి చేయడానికి కేంద్రంగా మారింది. సింజెంటా ఫౌండేషన్ ఇండియా కేంద్రాల్లో భాగంగా ఏర్పాటైన ఈ ఆర్ అండ్ డీ కేంద్రంలో సీడ్కేర్ ఇన్స్టిట్యూట్, శిక్షణా అకాడమి ఏర్పాటు చేశారు. 2018లో 13.5 బిలియన్ డాలర్ల విలువైన విక్రయాలతో సింజెంటా ప్రపంచ అగ్రశ్రేణి పంటల పరిరక్షణ ఉత్పత్తిగా నిలిచింది. విత్తనాల సంస్థల్లో మూడో స్థానంలో నిలిచింది. సింజెంటా సీఈఓ ఎరిక్ ఫ్యార్వాల్డ్ మాట్లాడుతూ 'పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహార వసతి కల్పించాలన్న క్లిష్టతరమైన సవాళ్లను అధిగమించేందుకు మానవత్వ కోణంలో మేం వ్యాపారం చేస్తున్నాం. అందుబాటులో ఉన్న వనరులను మెరుగ్గా ఉపయోగించుకుని పంటల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది' అని చెప్పారు. 'ఆహార ధాన్యాలపై 90 శాతానికి పైగా ఆహార పంటలను తగ్గించడంలో అద్భుతంగా సహాయాన్ని అందిస్తోంది. భారతదేశంలో అభివృద్ధి సాధించడానికి సింజెంటా ఆకర్షణీయంగా ఉండటానికి రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అండగా నిలిచింది. భారతదేశంలో వరి, కూరగాయలు, మొక్కజొన్నలు, గోధుమలు, పత్తి పంటల దిగుబడిలో సింజెంటా కీలకంగా వ్యవహరిస్తోంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com